“ మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

“ మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 14-2-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 226 Issue: 226

Published from Jagitial
www.evarthalu.com

14 ఫిబ్రవరి 2026 - శనివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:46 సూర్యాస్తమయం - సా. 6:13 తిథి ద్వాదశి మ. 3:58 వరకు తరువాత త్రయోదశి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం పూర్వాషాఢ సా. 6:05 వరకు తరువాత ఉత్తరాషాఢ యోగం సిద్ధి తె. 3:10౦ వరకు కరణం తైతుల మ. 3:58 వరకు గరజి తె. 4:37౦ వరకు వర్జ్యం రా. 2:47 నుండి తె. 4:29 వరకు దుర్ముహూర్తం ఉ. 8:18 నుండి ఉ. 9:04 వరకు రాహుకాలం ఉ. 9:38 నుండి ఉ. 11:04 వరకు యమగండం మ. 1:56 నుండి మ. 3:22 వరకు గుళికాకాలం ఉ. 6:46 నుండి ఉ. 8:12 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:10 నుండి తె. 5:58 వరకు అమృత ఘడియలు మ. 1:13 నుండి మ. 2:57 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:07 నుండి మ. 12:53 వరకు గమనిక: “౦” అనగా మరుసటి రోజున



మున్సిపల్ ఎన్నికల్లో పార్టీలు గెలిచిన వార్డులు

| కాంగ్రెస్ | బీఆర్ఎస్ | బీజేపీ | ఇతరులు |
|---|---|---|---|
| 1537 | 778 | 339 | 333 |

వార్డుల వారీగా ఫలితాలు.. 3వ పేజీలో

# కాంగ్రెస్సే ఫస్ట్

## మున్సిపల్ ఎన్నికల్లో హస్తం పార్టీ హవా

### 116 మున్సిపాలిటీలకు 66 కైవసం

### 13 మున్సిపాలిటీలతో బీఆర్ఎస్ సెకండ్

### 37 చోట్ల హంగ్.. ఇక స్వతంత్రులే కీలకం

రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించింది. రాష్ట్రంలోని మెజారిటీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కైవసం చేసుకుని తన పట్టును నిరూపించుకుంది. శాసనసభ ఎన్నికల తర్వాత జరిగిన ఈ కీలక పోరులో కాంగ్రెస్ ఘనవిజయం సాధించింది.

(ఈవార్తలు న్యూస్ నెట్‌వర్క్)

ఇప్పటివరకు వెలువడిన ఫలితాల ప్రకారం, రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ ఏకంగా 66 చోట్ల విజయం సాధించింది. మొత్తం 2,582 వార్డులకు గాను 1,347 వార్డుల్లో హస్తం గుర్తు అభ్యర్థులు గెలుపొందారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కేవలం 13 మున్సిపాలిటీలు, 717 వార్డులతో రెండో స్థానానికి పరిమితమైంది. ఇక బీజేపీ 261 వార్డుల్లో, ఇండిపెండెంట్ అభ్యర్థులు 256 వార్డుల్లో గెలిచారు. మరో 37 మున్సిపాలిటీల్లో ఏ పార్టీకీ స్పష్టమైన





# డైరెక్ట్ సీఎం అవుతా

### రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

### చౌటుప్పల్‌లో విజయోత్సవ ర్యాలీ

రాబోయే రోజుల్లో తనకు మంత్రి పదవి వస్తుందని మంత్రి కాకపోతే ముఖ్యమంత్రి అవుతానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సెన్సేషనల్ కామెంట్ చేశారు.

చౌటుప్పల్, ఫిబ్రవరి 13 (ఈవార్తలు): శుక్రవారం మున్సిపల్ ఎన్నికల ఫలితాలు విడుదలయ్యాక యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నుండి గెలుపొందిన కౌన్సిలర్ అభ్యర్థులతో మునుగోడు ఎమ్మెల్యే తరువాయి 2 వ పేజీలో...



# టఫ్ ఫైట్ ఇచ్చినం

## 30 శాతానికి పైగా స్థానాలు గెలుచుకున్నం

### కొత్తగూడెంలో సీపీఐ పార్టీకి మద్దతిస్తాం.. తెలంగాణలో మేమే ప్రత్యామ్నాయం: కేటీఆర్

రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ మంచి ఫలితాలను సాధించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గత ఏడాది చివరలో జరిగిన పంచాయతీ, ఇప్పుడు జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మంచి ఫలితాలు రాబట్టామని అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో 4 వేలకు పైగా స్థానాలు గెలుచుకున్నామని, ఇప్పుడు 2,500 మున్సిపల్ వార్డుల్లో 750 వరకు గెలుచుకుంటున్నామని అన్నారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (ఈవార్తలు): మొత్తంగా 30 శాతానికి పైగా సీట్లు గెలిచామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికార బలాన్ని ఉపయోగించి కొన్ని స్థానాలను దక్కించుకుందని ఆరోపించారు. గద్వాలలో ఒక వార్డులో నాలుగుసార్లు రీకౌంటింగ్ చేయించి కాంగ్రెస్ పార్టీ ఒక్క ఓటుతో గెలిచినట్లు ప్రకటించారని... గద్వాల, చౌటుప్పల్‌లో అధికారాన్ని అడ్డం పెట్టుకుని గెలిచారని ఆరోపించారు. కొన్నిచోట్ల తమ కౌన్సిలర్లను ఎత్తుకెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడానికి కాంగ్రెస్ అనేక తంటాలు పడుతోందని తరువాయి 2 వ పేజీలో...



# కాంగ్రెస్ అధికార దుర్వినియోగం

## టీబీజేపీ చీఫ్ రాంచందర్ రావు

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో తమ పార్టీ గొప్పగా రాణించిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ‘మున్సిపల్ ఫలితాల్లో 250 వార్డుల్లో గెలిచింది. సింగిల్ లార్జెస్ట్ పార్టీగా 6 మున్సిపాలిటీల్లో నిలిచింది. తొలిసారిగా కరీంనగర్, నిజామాబాద్ కార్పొరేషన్లు గెలిచాం. దాదాపుగా 320 నుంచి 350 వరకు కౌన్సిలర్స్ గెలిచారు. నారాయణపేట, ఆదిలాబాద్, రాయికల్ కైవసం చేసుకోబోతున్నాం.

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (ఈవార్తలు): గతంలో 2 మున్సిపాలిటీలను మాత్రమే గెలిచాం. మేము ఆశించిన ఫలితాలు వచ్చాయి. కొన్ని చోట్ల అనుకున్న ఫలితం రాలేదు. ప్రభుత్వ తప్పిదాలపై ఛార్జ్ షీట్, కరపత్రంతో ప్రచారం చేశాం. 200 వార్డుల్లో తక్కువ మెజారిటీతో అభ్యర్థులు ఓడిపోయారు. త్రిముఖ పోరులో నష్టం జరిగింది. అశ్వారావుపేట, కొత్తగూడెం కార్పొరేషన్‌లో గెలిచాం. నల్గొండలో అధికార దుర్వినియోగం జరిగింది. జిల్లా అధ్యక్షుడిపై పోలీసులు చేయి చేసుకున్నారు. అన్నీ దుర్వినియోగం చేశారు. ప్రభుత్వానికి క్లియర్ మెజార్టీ రాలేదు. సెకండ్తరువాయి 2 వ పేజీలో...



# క్యాంపు రాజకీయాలు షురూ..!

సుమారు 37 మున్సిపాలిటీల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో, చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. దీంతో ఇండిపెండెంట్లు, ఇతర పార్టీల సభ్యులను తమవైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు క్యాంపు రాజకీయాలకు తెరలేపాయి. ఇది రాబోయే రోజుల్లో రాజకీయ వేడిని మరింత పెంచనుంది. మున్సిపల్ చైర్మన్లు, మేయర్ల ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్‌ను శనివారం జారీ చేయనున్నారు. కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఫిబ్రవరి 16న (సోమవారం) ప్రమాణ స్వీకారం చేసి, అదే రోజు చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మేయర్లు, డిప్యూటీ మేయర్లను ఎన్నుకోనున్నారు.

# ట్రాన్స్ జెండర్ గెలుపు

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. నల్లగొండ జిల్లాలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ఓ ట్రాన్స్ జెండర్ విజయం సాధించారు.

జిల్లాలోని చిట్యాల మున్సిపాలిటీలో 1వ వార్డు నుంచి ట్రాన్స్‌జెండర్ సుధాకర్ పోటీ చేశారు. ఎన్నికల ప్రచారంలో మున్సిపాలిటీ అభివృద్ధి లక్ష్యంగా సుధాకర్ ఇచ్చిన హామీలు ఓటర్లను ఆకట్టుకున్నాయి. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులను కాదని ఓటర్లు సుధాకర్‌ను గెలిపించుకున్నారు.



# బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,578 |
| వెండి (గ్రాము): | రూ.280 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,914 |

# విశ్వవాణి



సామాన్య శకం 1500 నుంచి సామాన్య శకం 1800 మధ్య కాలంలో చాకోలెట్‌ను ఔషధంగా అందించేవారు. గుండె నొప్పి, జ్వరం, కడుపు సంబంధిత సమస్యలు, కిడ్నీ రోగాలు, వాంతులు తదితర సమయాల్లో ఫిజీషియన్లు చాకోలెట్‌ను టాబ్లెట్‌గా అందించేవారు. ఆ తర్వాతి కాలంలో అది ఆహారపదార్థంగా మారిపోయింది.



# బంగ్లాలో తారిఖ్ సర్కారు

## ఎన్నికల్లో బీఎన్పీ ఘన విజయం

ఢాకా: బంగ్లాదేశ్ పార్లమెంటు ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ) విజయం సాధించింది. మొత్తం 299 పార్లమెంటు స్థానాలకు జరిగిన పోలింగ్‌లో మిత్రపక్షాలతో కలిపి 212 స్థానాల్లో విజయం సాధించినట్లు పార్టీ ప్రకటించింది. ఈ క్రమంలో బీఎన్‌పీ నేత తారిఖ్ రహ్మాన్ నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమవుతున్నట్లు వెల్లడించింది. జమాత్-ఏ-ఇస్లామీ పార్టీ 70 సీట్లు గెలుచుకుంది. ఇతర పార్టీలు, స్వతంత్రులు మిగిలిన స్థానాలు గెలుచుకున్నారు. ఎన్నికల ఫలితాలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి తరువాయి 2 వ పేజీలో...

# పాపం.. కండోమ్‌లు కరువు!

## వింటర్ ఒలింపిక్స్‌లో వింత సమస్య

### 3 రోజుల్లోనే 10 వేల ప్యాకెట్ల స్టాక్ పూర్తి

### అథ్లెట్ల నుంచి ఊహించని డిమాండ్




మిలాన్: ఇటలీలోని మిలాన్-కోర్టినాలో జరుగుతున్న 2026 వింటర్ ఒలింపిక్స్‌లో ఒక చిత్రమైన సమస్య తలెత్తింది. క్రీడా గ్రామంలో అథ్లెట్ల కోసం ఉచితంగా ఏర్పాటు చేసిన కండోమ్‌ల స్టాక్ కేవలం మూడు రోజుల్లోనే పూర్తిగా అయిపోయింది. దీంతో నిర్వాహకులు వెంటనే కొత్త స్టాక్ కోసం పరుగులు పెట్టాల్సి వచ్చింది. ఒలింపిక్స్ ప్రారంభమయ్యాక నిర్వాహకులు సుమారు 10 వేల కండోమ్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. అయితే, 92 దేశాల నుంచి వచ్చిన దాదాపు 2,900 మంది అథ్లెట్లు ఉన్న క్రీడా గ్రామంలో ఈ నిల్వలు చాలా వేగంగా ఖాళీ అయ్యాయి. సరఫరా కేవలం - 2 వ పేజీలో...



# జింబాబ్వే కిర్రాక్.. ఆసీస్ షాక్..!

## కంగారులకు మైండ్ బ్లాంక్

### టీ20 వరల్డ్ కప్‌లో సంచలనం

కొలంబో: టీ20 వరల్డ్ కప్‌లో సంచలన నమోదు అయ్యింది. కొలంబోలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై 23 రన్స్ తేడాతో జింబాబ్వే విక్టరీ కొట్టింది. జింబాబ్వే క్రికెటర్లు అద్భుతమైన ఆటను తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు



14.2.2026

మేషం: చిన్ననాటి మిత్రులతో గృహమున సంతోషంగా గడుపుతారు. వృత్తి ఉద్యోగాల్లో అధికారుల ఆదరణ పొందుతారు. కుటుంబ సభ్యుల నుండి అవసరానికి ధన సహాయం అందుతుంది. వాహన సంభంధిత వ్యాపారాలు రాణిస్తాయి. నిరుద్యోగ ప్రయత్నాలు ఉత్సాహంగా సాగుతాయి.

వృషభం: కుటుంబ సభ్యులతో గృహమున సంతోషంగా గడుపుతారు. వృత్తి ఉద్యోగాల్లో అనుకూల వాతావరణం ఉంటుంది. సంఘంలో కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. శుభకార్యాలకు ధన వ్యయం చేస్తారు. వ్యాపారాలు లాభాల బాట పడతాయి. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యల నుంచి ఉపసమనం పొందుతారు.

మిధునం: నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. చేపట్టిన పనులలో ఆటంకాలు తప్పవు. సంతానం విద్యా ఉద్యోగ విషయాలలో దృష్టి సారించడం మంచిది. కీలక వ్యవహారాలలో బద్దకించడం మంచిది కాదు. కుటుంబమున కొందరి ప్రవర్తన మానసికంగా బాధిస్తుంది.

కర్కాటకం: దూరప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. వృత్తి వ్యాపారాలలో నిదానంగా వ్యవహరించాలి. ఉద్యోగస్తులకు శ్రమాధిక్యత పెరుగుతుంది. చేపట్టిన పనులు మధ్యలో నిలిచిపోతాయి. దైవ చింతన పెరుగుతుంది. మాతృ వర్గ బంధువులతో మాటపట్టింపులుంటాయి. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు.

సింహం: దైవ కార్యక్రమాలలో ఆసక్తి పెరుగుతుంది. ఆదాయం మార్గాలు ఆశించిన విధంగా ఉంటాయి. సన్నిహితుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ఉద్యోగస్తులకు ఉన్నత అవకాశాలు లభిస్తాయి. వ్యాపారాలు విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు.

కన్య: సోదరులతో కొన్ని విషయాలలో మాటపట్టింపులు ఉంటాయి. ధన పరంగా ఒడిదుడుకులు అధికమవుతాయి. చేపట్టిన పనులు కొంత మందకొడిగా సాగుతాయి. వ్యాపారస్తులకు నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో సమస్యలు పెరుగుతాయి.

తుల: నూతన వ్యాపారాలకు పెట్టుబడులు సమకూరుతాయి. వృత్తి ఉద్యోగాలలో మీ విలువ పెరుగుతుంది. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. గృహంలో శుభకార్యాలు నిర్వహిస్తారు. చిన్ననాటి మిత్రుల నుండి ధన సహయం అందుతుంది. స్థిరాస్తి క్రయ విక్రయాలలో లాభాలు అందుకుంటారు.

వృశ్చికం: దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ముఖ్యమైన వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు చేయడం మంచిది కాదు. వృధా ఖర్చులు పెరుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. వృత్తి వ్యాపారాలలో సమస్యాత్మక వాతావరణం ఉంటుంది. ఉద్యోగమున ఇతరుల ప్రవర్తన వలన ఇబ్బందులు తప్పవు.

ధనస్సు: ధన వ్యవహారాలు సంతృప్తికరంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాల్లో శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. నిరుద్యోగులకు అధికారుల అనుగ్రహం కలుగుతుంది. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. ఇంటా బయట వివాదాలు పరిష్కరించుకుంటారు.

మకరం: నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. సంఘంలో పెద్దలతో సఖ్యతగా వ్యవహరించి ప్రశంసలు అందుకుంటారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వ్యాపారాలు మరింత పుంజుకుంటాయి. ఉద్యోగస్తులకు అనుకూల వాతావరణం ఉంటుంది. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. అన్ని వైపుల నుండి ఆదాయం అందుతుంది.

కుంభం: దూరపు బంధువుల నుండి ఆశ్చర్యకర విషయాలు తెలుస్తాయి. చేపట్టిన పనులలో అవరోధాలు ఉన్నప్పటికీ నిదానంగా పూర్తి చేస్తారు. ఉద్యోగస్తులకు అదనపు బాధ్యతలు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో వ్యయ ప్రయాసలతో కానీ పనులు పూర్తికావు. వృధా ఖర్చుల విషయంలో పునరాలోచన చేయడం మంచిది.

మీనం: వాహన ప్రయాణ విషయంలో జాగ్రత్త వహించాలి. ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. గృహ నిర్మాణ పనులలో అవరోధాలుంటాయి. ఉద్యోగాలలో స్థానచలన సూచనలు ఉన్నవి. నూతన రుణాలు చేయడం మంచిది కాదు. వ్యాపారస్థులకు గందరగోళ పరిస్థితులుంటాయి.

# మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు

## ఐఅండ్‌పీఆర్ కమిషనర్ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (ఈవార్తలు): తెలంగాణలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ ప్రక్రియ కోసం ప్రభుత్వం 'స్టేట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ' ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసింది. మీడియా అకాడమీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ అధ్యక్షతన పనిచేసే ఈ కమిటీలో వివిధ జర్నలిస్ట్ సంఘాలు, ప్రముఖ మీడియా సంస్థల ప్రతినిధులకు చోటు కల్పించారు. 'తెలంగాణ మీడియా అక్రిడిటేషన్ రూల్స్, 2025' ప్రకారం అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల మంజూరును ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. ఈ కమిటీలో ప్రభుత్వం, వివిధ జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులకు చోటు కల్పించారు. కమిటీకి మీడియా అకాడమీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ అధ్యక్షత వహించనున్నారు. కో-చైర్మన్‌గా సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ఉంటారు. జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధుల నుంచి తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజేహెచ్-9), తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (హెచ్-143), తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్), తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (టీజేఏ) ప్రతినిధులు సభ్యులుగా ఉండనున్నారు. ప్రింట్ మీడియా సంస్థల ప్రతినిధులుగా ఈనాడు నుంచి ఎ. రంగారావు, సియాసత్ నుంచి అమీర్ అలీ ఖాన్, దిశ డైలీ నుంచి శ్రీనివాస్ రెడ్డి, పొద్దు నుంచి బైస రామదేవిని సభ్యులుగా నియమించారు. వీ6 నుంచి మురళీకృష్ణ, ఫోటో జర్నలిస్ట్స్ (డెక్కన్ క్రానికల్) నుంచి బిహెచ్‌కే గాంధీ, వీడియో జర్నలిస్ట్స్ నుంచి బిగ్ టీవీ నాగేశ్వరరావు, మహిళా జర్నలిస్టులుగా ఎన్టీవీ నుంచి రాధిక, ది హిందూ నుంచి స్వాతి వడ్లమూడి, డెస్క్ జర్నలిస్ట్స్ ప్రతినిధిగా ఆంధ్రజ్యోతి నుంచి బీ శ్రీనివాస్ రావు నియమితులయ్యారు. ఇక, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రతినిధి, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు, టీజీఆర్‌టీసీ ప్రతినిధి, దక్షిణ మధ్య రైల్వే ప్రతినిధి కూడా ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఐ అండ్ పీఆర్ జాయింట్ డైరెక్టర్ ఈ కమిటీకి సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు. అర్హులైన జర్నలిస్టుల దరఖాస్తులను పరిశీలించి అక్రిడిటేషన్ కార్డులను జారీ చేసే బాధ్యతను ఈ కమిటీ నిర్వహిస్తుంది. అలాగే జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీలకు ఆమోదం తెలిపే అధికారాన్ని ఐ అండ్ పీఆర్ ప్రత్యేక కమిషనర్‌కు ప్రభుత్వం అప్పగించింది.




# కాంగ్రెస్సే ఫస్ట్

**మొదటి పేజీ తరువాయి**

మెజారిటీ రాకపోవడంతో హంగ్ వాతావరణం నెలకొంది. ఈ ప్రాంతాల్లో ఛైర్మన్ల ఎన్నికలో స్వతంత్రులు, ఇతర చిన్న పార్టీల మద్దతు కీలకం కానుంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని వడ్డేపల్లి మున్సిపాలిటీని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ గెలుచుకోవడం విశేషం. కార్పొరేషన్లలోనూ కాంగ్రెస్ హవా స్పష్టంగా కనిపించింది. మంచిర్యాల, రామగుండం, నల్లగొండ కార్పొరేషన్లను కాంగ్రెస్ దక్కించుకుంది.

### మా పాలనకు ఫలితాలు నిదర్శనం: సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు తమ రెండేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన బలమైన తీర్పు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి అఖండ విజయాన్ని అందించిన ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తమ ప్రజా ప్రభుత్వ పాలనకు, పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి, ప్రపంచస్థాయి ప్రణాళికలతో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఈ తీర్పు ద్వారా ప్రజలు సంపూర్ణ ఆమోదం తెలిపారని ఆయన శుక్రవారం పేర్కొన్నారు. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. వెలువడిన ఫలితాల ప్రకారం, 116 మున్సిపాలిటీలకు గాను 66 చోట్ల కాంగ్రెస్ జెండా ఎగురవేసింది. అలాగే 7 కార్పొరేషన్లలో 3 చోట్ల స్పష్టమైన మెజారిటీ సాధించగా, మరో కార్పొరేషన్‌లో ఆధిక్యంలో కొనసాగుతోంది. ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాని మరో 37 మున్సిపాలిటీలలో కూడా పీఠాలను కైవసం చేసుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ చారిత్రక విజయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా స్పందించారు. 'లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తల అవిశ్రాంత శ్రమకు దక్కిన ఫలితమే ఈ విజయం. పార్టీ పట్ల వారికి ఉన్న అపారమైన అభిమానానికి ఇది నిలువుటద్దం. పార్టీ జెండాను మోసి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లిన ప్రతి కార్యకర్తకు ఈ విజయాన్ని అంకితం చేస్తున్నాను' అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. ఈ గెలుపు తమ బాధ్యతను మరింత పెంచిందని సీఎం అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి, పారదర్శక పాలనకు తాము పునరంకితం అవుతున్నామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఎన్నికల్లో ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ప్రతి మున్సిపాలిటీని, ప్రతి కార్పొరేషన్‌ను అభివృద్ధి పథంలో నడిపించి చూపిస్తామని భరోసా ఇచ్చారు.

### ప్రియాంకతో రేవంత్ భేటీ

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన వేళ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీతో భేటీ అయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ భారీ విజయం సాధించడంపై వారి మధ్య చర్చ జరిగింది. అత్యధిక మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దక్కించుకోవడంపై హర్షం వ్యక్తం చేసిన ప్రియాంక గాంధీ.. రేవంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి అభినందనలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కారణంగానే ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించారని ఈ సందర్భంగా ప్రియాంక గాంధీతో రేవంత్ రెడ్డి అన్నారు.



# ఎన్టీఆర్.. కేసీఆరే ఓడారు!

## రేవంత్ నేనే రాజు వ్యాఖ్యలపై కేటీఆర్ కౌంటర్

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (ఈవార్తలు: తెలంగాణకు 'నేనే రాజు నేనే మంత్రి' అన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, 'నేనే రాజు నేనే మంత్రి' అనుకునే పిచ్చి తుగ్లక్‌లు చాలామంది ఉంటారని, చరిత్రలో కూడా ఒక తుగ్లక్ ఉండేవాడని ఎద్దేవా చేశారు. అలా అనుకున్నవారు ఎందరో గాలికి కొట్టుకుపోయారని అన్నారు. ప్రజల చైతన్యాన్ని ఎవరూ తక్కువ అంచనా వేయవద్దని అన్నారు. ఈ దేశంలో ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ వంటి నాయకులు సైతం ఓడిపోయారని గుర్తు చేశారు. తెలంగాణ సాధించిన కేసీఆర్ వంటి నాయకుడిని కూడా కామారెడ్డిలో దురదృష్టవశాత్తూ ప్రజలు ఓడించారని అన్నారు. అక్కడ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడో స్థానానికి వచ్చారని గుర్తు చేశారు. ఇలా నేనే రాజు నేనే మంత్రి అని రేవంత్ రెడ్డిలా విర్రవీగిన వాళ్లు వచ్చారు, పోయారని... కానీ దేశం, ప్రజల చైతన్యం అలాగే ఉందన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో తాము పూర్తి స్పష్టతతో ఉన్నామని కేటీఆర్ అన్నారు. తన ప్రభుత్వంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అంత విశ్వాసం ఉంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి తిరిగి ఉప ఎన్నికలకు రావాలని సవాల్ చేశారు. పది చోట్ల ఉప ఎన్నికలు వస్తే అప్పుడు ప్రజలు తేల్చుతారని అన్నారు.

# టఫ్ ఫైట్ ఇచ్చినం

**మొదటి పేజీ తరువాయి**

అన్నారు. 116 మున్సిపాలిటీల్లో తాము సొంతంగా 15 నుంచి 16 గెలుచుకున్నామని కేటీఆర్ వెల్లడించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ఈ ఎన్నికల కోసం వీరోచిత పోరాటం చేశారని ప్రశంసించారు. ప్రజలు కూడా ధైర్యంగా బయటకు వచ్చి ఓటేశారని, కానీ కాంగ్రెస్ పార్టీ మోసంతో ఎక్కువ స్థానాలు గెలుచుకుంటోందని అన్నారు.

### సీపీఐ పార్టీకి ఓపెన్ ఆఫర్ ఇచ్చాం

సింగరేణిలో జరుగుతున్న అక్రమాలకు వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు కొత్తగూడెంలో తాము బేషరతుగా సీపీఐకి మద్దతిస్తామని ఆయన ప్రకటించారు. ఈ మేరకు ఎమ్మెల్యే సాంబశివరావుతో మాట్లాడినట్లు చెప్పారు. సింగరేణిలో రూ.6 వేల కోట్ల బొగ్గు కుంభకోణం జరిగిందని, దీనిని అడ్డుకునేందుకు మీతో కలిసి వస్తామని సీపీఐకి ఓపెన్ ఆఫర్ ఇచ్చామని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి సింగరేణికి అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ దోపిడీ చేస్తుంటే బీజేపీ ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. ఇక, తెలంగాణలో బీఆర్ఎస్ మాత్రమే ప్రత్యామ్నాయమని ప్రజలు నిన్న పంచాయతీ, నేడు మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో స్పష్టం చేశారని కేటీఆర్ అన్నారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మాత్రమే సమస్యలపై పోరాడుతుందని ప్రజలు తేల్చి చెప్పారని అన్నారు. కలిసొచ్చే లౌకికవాద పార్టీలను కలుపుకుని ముందుకు సాగుతామని ఆయన అన్నారు. ఇదే ఉత్సాహంతో జీహెచ్ఎంసీ, జిల్లా పరిషత్ ఎన్నికల్లో పోటీ చేస్తామని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి మంచి భవిష్యత్తు ఉందనడానికి ఈ ఫలితాలు నిదర్శనమని అన్నారు. ఓడిపోయిన వారు నిరాశపడవద్దని సూచించారు.

# బంగ్లాలో తారిఖ్ సర్కారు

**మొదటి పేజీ తరువాయి**

ఉన్నా.. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మెజార్టీ మార్క్‌ను బీఎన్‌పీ దాటేసింది. ఇక, ఈ ఎన్నికల్లో తారిఖ్ రహ్మాన్ ఢాకా-17, బోగ్రా-6 స్థానాల నుంచి బరిలోకి దిగారు. ఈ రెండుచోట్ల కూడా ఆయన విజయం సాధించారు.

### పాక్‌తో దగ్గరి బంధం

తారిక్ గెలుపు పాకిస్తాన్‌తో ఉన్న సంబంధాలలో సరికొత్త చర్చకు దారితీసింది. గతంలో అవామీ లీగ్ హయాంలో షేక్ హసీనా ప్రభుత్వం భారత్‌తో సన్నిహిత సంబంధాలను కొనసాగిస్తూ, పాకిస్తాన్‌కు దూరం పాటిస్తూ వచ్చింది. అయితే బీఎన్‌పీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, పాకిస్తాన్‌తో సంబంధాలు మెరుగుపడతాయని ఇస్లామాబాద్ ఆశిస్తోంది. చారిత్రక నేపథ్యం, గత అనుభవాల దృష్ట్యా తారిఖ్ రెహ్మాన్ నాయకత్వం తమకు వ్యూహాత్మక ప్రయోజనాలను చేకూరుస్తుందని పాక్ అంచనా వేస్తోంది. తారిఖ్ రెహ్మాన్ గతంలో అధికారంలో ఉన్నప్పుడు భారత్‌పై వ్యతిరేక ధోరణిని ప్రదర్శించారనే ఆరోపణలు ఉన్నాయి. ఆయన హయాంలో భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాల్లో వేర్పాటువాద గ్రూపులకు మద్దతు లభించిందనే విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు ఆయన తిరిగి అధికారంలోకి వచ్చాక భారత్-బంగ్లాదేశ్ మధ్య ఉన్న దౌత్య, భద్రతా సంబంధాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇదే తరుణంలో పాకిస్తాన్ ఈ పరిస్థితిని తనకు అనుకూలంగా మార్చుకోవాలని చూస్తోందనే వార్తలు వినిపిస్తున్నాయి.

# కాంగ్రెస్ అధికార దుర్వినియోగం

**మొదటి పేజీ తరువాయి**

వచ్చారని బీఆర్ఎస్ నేతలు సంబరపడటం శోచనీయం. మా పార్టీ ఓట్ శాతం, పార్టీ బలంగా విస్తరిస్తోంది. చాలా చోట్లా బీజేపీ దగ్గరికి వచ్చి ఆగిపోయింది. బీజేపీ గెలిచే చోటా బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు ఓట్లు వేయాలని మజ్లిస్ పార్టీ చెప్పింది. బీజేపీని ఎదగకుండా కాంగ్రెస్, బీఆర్ఎస్, వామపక్షాలు అడ్డుకునేందుకు కలిసి పనిచేశాయి. బీజేపీ ఇప్పుడిప్పుడే తెలంగాణలో విస్తరిస్తోంది. కేరళలో ఎంటరయ్యాం. తెలంగాణ ప్రజలు బీజేపీకి మంచి తీర్పు ఇచ్చారు' అని పేర్కొన్నారు.

# డైరెక్ట్ సీఎం అవుతా

**మొదటి పేజీ తరువాయి**

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మునుగోడు ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తనకు అడుక్కోవడం రాదని మర్యాదగా ఇచ్చిన మాటకు కట్టుబడి మంత్రి పదవి ఇవ్వండని లేదంటే లాక్కునేదాకా చూసుకోవద్దంటూ ఘాటుగానే హెచ్చరించారు. తనకు ఇచ్చిన మాట ప్రకారం చేయండి లేదంటే డైరెక్ట్ నా టార్గెట్ అదే అంటూ ముఖ్యమంత్రి పదవిని ఉద్దేశించి అన్నారు. ఇకనుండి మునుగోడు నియోజకవర్గంను(ప్రజలు) చూసుకుంటే తెలంగాణ రాష్ట్రాన్ని నేను చూసుకుంటానని ఎమ్మెల్యే అన్నారు. సమయం వచ్చినప్పుడు తెలంగాణలో ఇక జెండా ఎగరవేద్దామంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఆయన వెంట మునుగోడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమన్వయకర్త రాజు గౌడ్, గెలుపొందిన నూతన కౌన్సిలర్లు ఉన్నారు.

# పాపం.. కండోమ్‌లు కరువు!

**మొదటి పేజీ తరువాయి**

మూడు రోజుల్లోనే అయిపోయిందని, కొత్త స్టాక్ ఎప్పుడొస్తుందో తెలియదని ఓ అథ్లెట్ చెప్పినట్లు ఇటాలియన్ మీడియా 'లా స్టాంపా' తన కథనంలో పేర్కొంది. సాధారణంగా ఒలింపిక్స్‌లో అథ్లెట్లకు ఉచితంగా కండోమ్‌లు అందించడం 1988 సియోల్ ఒలింపిక్స్ నుంచి వస్తున్న సంప్రదాయం. సురక్షిత శృంగారాన్ని ప్రోత్సహించడం, హెచ్ఐవీ/ఎయిడ్స్ వంటి వ్యాధుల నివారణ దీని ముఖ్య ఉద్దేశం. గత 2024 పారిస్ సమ్మర్ ఒలింపిక్స్‌లో 10,500 మంది అథ్లెట్ల కోసం 3 లక్షలకు పైగా కండోమ్‌లను అందించారు. అయితే, వింటర్ ఒలింపిక్స్‌లో అథ్లెట్ల సంఖ్య తక్కువగా ఉండటంతో ఈసారి తక్కువ స్టాక్ తెచ్చారు. అయితే, అథ్లెట్ల నుంచి ఊహించని స్థాయిలో డిమాండ్ రావడంతో ఈ 'కండోమ్ క్రైసిస్' ఏర్పడింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు నిర్వాహకులు వెంటనే రంగంలోకి దిగారు. త్వరలోనే కొత్త స్టాక్‌ను క్రీడా గ్రామానికి తరలించి, ఒలింపిక్స్ ముగిసే వరకు కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

# జింబాబ్వే కిర్రాక్.. ఆసీస్ షాక్..!

**మొదటి పేజీ తరువాయి**

ప్రదర్శించారు. తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే నిర్ణీత ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 169 రన్స్ చేసింది. జింబాబ్వే ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ అత్యధికంగా 64 రన్స్ స్కోరు చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో ఏడు ఫోర్లు ఉన్నాయి. జింబాబ్వే బ్యాటర్లలో మరుమని 35, ర్యాన్ బర్ల్ 35, సికందర్ రాజా 25 రన్స్ స్కోరు చేశారు. జింబాబ్వే 15 ఓవర్లలో వికెట్ నష్టానికి 125 రన్స్ చేసి భారీ స్కోరు దిశగా అడుగులు వేసింది. కానీ ఆసీస్ బౌలర్లు రాణించడంతో చివరి అయిదు ఓవర్లలో జింబాబ్వేకు 44 రన్స్ మాత్రమే వచ్చాయి. జింబాబ్వే విసిరిన టార్గెట్‌ను అందుకునే క్రమంలో ఆస్ట్రేలియా చేతులెత్తేసింది. అనూహ్య రీతిలో ఓటమిని ఎదుర్కొన్నది. 19.3 ఓవర్లలో 146 రన్స్ చేసి ఆలౌటైంది. ఆసీస్ బ్యాటర్లలో మాట్ రెన్‌షా 65, మ్యాక్స్‌వెల్ 31 రన్స్ చేశారు. జింబాబ్వే బౌలర్లలో ముజర్‌బానీ 4, బ్రాడ్ ఇవాన్స్ 3 వికెట్లు తీసుకున్నారు. చేజింగ్‌లో కేవలం 29 రన్స్‌కే నాలుగు వికెట్లు కోల్పోయింది ఆస్ట్రేలియా. ఆ తర్వాత అయిదో వికెట్‌కు మ్యాక్స్‌వెల్, రెన్‌షా 77 రన్స్ జోడించారు. కానీ ఆసీస్ మేటి బ్యాటర్లు జట్టుకు విజయాన్ని అందించలేకపోయారు. 4 ఓవర్లలో 17 రన్స్ ఇచ్చి 4 వికెట్లు తీసుకున్న ముజరబానీ .. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు



గెలుచుకున్నాడు. టీ20 క్రికెట్‌లో అతను వంద వికెట్ల తీసుకున్న బౌలర్‌గా నిలిచాడు

# 'పుర' ఫలితాలు

## మున్సిపాలిటీలు.. వార్డుల వారీగా గెలిచిన పార్టీ

| మున్సిపాలిటీలు | కాంగ్రెస్ | బీఆర్ఎస్ | బీజేపీ | ఇతరులు |
|---|---|---|---|---|
| ఆదిలాబాద్ 49 | 11 | 6 | 21 | 11 |
| అశ్వరావుపేట 22 | 17 | 2 | 1 | 2 |
| ఇల్లందు 24 | 19 | 3 | 0 | 2 |
| పరకాల 22 | 13 | 6 | 3 | 0 |
| ధర్మపురి 15 | 15 | 0 | 0 | 0 |
| జగిత్యాల 50 | 23 | 4 | 6 | 17 |
| కోరుట్ల 33 | 18 | 8 | 6 | 1 |
| మెట్‌పల్లి 26 | 6 | 6 | 10 | 4 |
| రాయికల్ 12 | 3 | 3 | 5 | 1 |
| జనగాం 30 | 12 | 13 | 0 | 5 |
| స్టేషన్ ఘన్‌పూర్ 18 | 13 | 5 | 0 | 0 |
| భూపాలపల్లి 30 | 16 | 10 | 2 | 2 |
| అలంపూర్ 10 | 5 | 5 | 0 | 0 |
| గద్వాల్ 37 | 16 | 11 | 7 | 3 |
| ఐజ 20 | 7 | 13 | 0 | 0 |
| వడ్డేపల్లి 10 | 1 | 1 | 0 | 8 |
| బాన్స్‌వాడ 19 | 11 | 3 | 3 | 2 |
| బిచ్కుంద 12 | 10 | 2 | 0 | 0 |
| కామారెడ్డి 49 | 19 | 10 | 18 | 2 |
| యెల్లారెడ్డి 12 | 10 | 1 | 0 | 1 |
| చొప్పదండి 14 | 10 | 1 | 3 | 0 |
| హుజురాబాద్ 30 | 16 | 8 | 5 | 1 |
| జమ్మికుంట 30 | 10 | 12 | 4 | 4 |
| ఏదులాపురం 32 | 24 | 2 | 0 | 6 |
| కల్లూరు 20 | 12 | 6 | 1 | 1 |
| మధిర 22 | 18 | 1 | 0 | 3 |
| సత్తుపల్లి 23 | 17 | 6 | 0 | 0 |
| వైరా 20 | 12 | 5 | 0 | 3 |
| ఆసిఫాబాద్ 20 | 7 | 9 | 0 | 4 |
| కాగజ్ నగర్ 30 | 10 | 10 | 5 | 5 |
| డోర్నకల్ 15 | 11 | 4 | 0 | 0 |
| కేసముద్రం 16 | 8 | 8 | 0 | 0 |
| మహబూబాబాద్ 36 | 13 | 11 | 1 | 11 |
| మరిపెడ 15 | 9 | 5 | 0 | 1 |
| తొర్రూర్ 16 | 7 | 9 | 0 | 0 |
| భూత్‌పూర్ 10 | 7 | 1 | 2 | 0 |
| దేవరకద్ర 12 | 6 | 4 | 1 | 1 |
| బెల్లంపల్లి 34 | 14 | 14 | 1 | 5 |
| చెన్నూర్ 18 | 11 | 4 | 2 | 1 |
| క్యాతన్‌పల్లి 22 | 7 | 10 | 1 | 4 |
| లక్సెట్టిపేట 15 | 11 | 3 | 1 | 0 |
| మెదక్ 32 | 14 | 15 | 2 | 1 |
| నర్సాపూర్ 15 | 6 | 5 | 4 | 0 |
| రామాయంపేట 12 | 8 | 3 | 1 | 0 |
| తూప్రాన్ 16 | 4 | 9 | 3 | 0 |
| అలియాబాద్ 20 | 8 | 7 | 3 | 2 |
| ముదుచింతలపల్లి 24 | 10 | 13 | 1 | 0 |
| యెల్లంపేట 24 | 8 | 12 | 4 | 0 |
| ములుగు 20 | 12 | 5 | 1 | 2 |
| కల్వకుర్తి 22 | 13 | 3 | 5 | 1 |
| కొల్లాపూర్ 19 | 16 | 3 | 0 | 0 |
| నాగర్ కర్నూల్ 24 | 16 | 6 | 0 | 0 |
| చండూర్ 10 | 6 | 3 | 0 | 1 |
| చిట్యాల్ 12 | 9 | 2 | 0 | 1 |
| దేవరకొండ 20 | 10 | 7 | 1 | 2 |
| హాలియా 12 | 11 | 1 | 0 | 0 |
| మిర్యాలగూడ 48 | 31 | 14 | 1 | 1 |
| కోస్గి 16 | 16 | 0 | 0 | 0 |
| మద్దూర్ 16 | 9 | 6 | 0 | 1 |
| మక్తల్ 16 | 12 | 0 | 3 | 0 |
| నారాయణపేట 24 | 7 | 2 | 11 | 4 |
| భైంసా 26 | 1 | 0 | 6 | 19 |
| ఖానాపూర్ 12 | 3 | 4 | 4 | 1 |
| నిర్మల్ 42 | 24 | 2 | 13 | 3 |
| ఆర్మూర్ 36 | 19 | 5 | 8 | 4 |
| భీమ్‌గల్ 12 | 8 | 4 | 0 | 0 |
| బోధన్ 38 | 17 | 5 | 3 | 13 |
| మంథని 13 | 11 | 1 | 0 | 1 |
| పెద్దపల్లి 36 | 27 | 1 | 1 | 7 |
| సుల్తానాబాద్ 15 | 12 | 1 | 1 | 1 |
| సిరిసిల్ల 39 | 6 | 27 | 5 | 1 |
| వేములవాడ 28 | 13 | 5 | 8 | 2 |
| ఆమన్‌గల్ 15 | 1 | 8 | 6 | 0 |
| చేవెళ్ల 18 | 11 | 4 | 3 | 0 |
| మొయినాబాద్ 26 | 10 | 7 | 4 | 5 |
| షాద్‌నగర్ 28 | 15 | 11 | 1 | 1 |
| శంకర్‌పల్లి 15 | 9 | 4 | 0 | 2 |
| ఆందోల్-జోగిపేట 20 | 16 | 3 | 0 | 1 |
| గడ్డపోతారం 18 | 3 | 14 | 0 | 1 |
| గుమ్మడిదల 22 | 4 | 15 | 2 | 1 |
| ఇంద్రేశం 18 | 6 | 9 | 2 | 1 |
| ఇస్నాపూర్ 26 | 10 | 12 | 0 | 4 |
| జిన్నారం 20 | 6 | 8 | 4 | 2 |
| కోహిర్ 16 | 8 | 5 | 1 | 2 |
| నారాయణఖేడ్ 15 | 11 | 3 | 1 | 0 |
| సదాశివపేట 26 | 17 | 7 | 1 | 1 |
| సంగారెడ్డి 38 | 22 | 10 | 2 | 4 |
| జహీరాబాద్ 37 | 14 | 15 | 3 | 1 |
| చేర్యాల 12 | 5 | 7 | 0 | 0 |
| దుబ్బాక 20 | 4 | 11 | 2 | 3 |
| గజ్వేల్ 20 | 7 | 11 | 1 | 1 |
| హుస్నాబాద్ 20 | 16 | 4 | 0 | 0 |
| హుజూర్ నగర్ 28 | 19 | 4 | 0 | 5 |
| కోదాడ 35 | 26 | 3 | 0 | 6 |
| నేరేడ్‌చర్ల 15 | 9 | 5 | 0 | 1 |
| సూర్యాపేట 48 | 31 | 13 | 1 | 3 |
| తిరుమలగిరి 15 | 5 | 10 | 0 | 0 |
| కొడంగల్ 12 | 10 | 1 | 0 | 1 |
| పరిగి 18 | 8 | 8 | 0 | 2 |
| తాండూర్ 36 | 19 | 12 | 3 | 2 |
| వికారాబాద్ 34 | 16 | 11 | 4 | 3 |
| అమరచింత 10 | 3 | 3 | 3 | 1 |
| ఆత్మకూర్ 10 | 6 | 1 | 3 | 0 |
| కొత్తకోట 15 | 10 | 3 | 1 | 1 |
| పెబ్బేరు 12 | 7 | 5 | 0 | 0 |
| వనపర్తి 33 | 20 | 8 | 2 | 3 |
| నర్సంపేట 30 | 21 | 6 | 1 | 2 |
| వర్ధన్నపేట 12 | 5 | 6 | 0 | 1 |
| భువనగిరి 35 | 23 | 3 | 4 | 5 |
| చౌటుప్పల్ 20 | 13 | 3 | 3 | 1 |
| మోత్కూర్ 12 | 8 | 3 | 0 | 1 |
| పోచంపల్లి 13 | 6 | 5 | 1 | 1 |
| యాదగిరిగుట్ట 12 | 8 | 1 | 2 | 1 |
| నందికొండ 12 | 11 | 1 | 0 | 0 |
| ఇబ్రహీంపట్నం 24 | 8 | 13 | 2 | 1 |
| ఆలేరు 12 | 7 | 3 | 2 | 0 |

## కార్పొరేషన్లు.. వార్డుల వారీగా గెలిచిన పార్టీ

| కార్పొరేషన్లు | కాంగ్రెస్ | బీఆర్ఎస్ | బీజేపీ | ఇతరులు |
|---|---|---|---|---|
| రామగుండం (60/60) | 38 | 13 | 1 | 8 |
| నిజామాబాద్ (60/60) | 17 | 1 | 28 | 14 |
| మహబూబ్‌నగర్ (59/60) | 29 | 15 | 7 | 8 |
| మంచిర్యాల (60/60) | 44 | 8 | 5 | 3 |
| కరీంనగర్ (66/66) | 14 | 9 | 30 | 13 |
| నల్లగొండ (48/48) | 27 | 9 | 4 | 8 |
| కొత్తగూడెం (60/60) | 22 | 8 | 1 | 29 |



# ఒకే కాలనీలో 6 పార్కులు సేఫ్

**హైదరాబాద్‌లో పార్కుల కబ్జాలపై హైడ్రా ఉక్కుపాదం**

**రూ.34 కోట్ల విలువైన 3041 గజాల భూముల స్వాధీనం**

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలో ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన పార్కుల స్థలాల కబ్జాపై హైడ్రా ఉక్కుపాదం మోపింది. ప్రజలకు ప్రాణవాయువును అందించే పచ్చని ప్రదేశాలను కాపాడేందుకు నడుం బిగించింది. శుక్రవారం ఒక్కరోజే రెండు వేర్వేరు ప్రాంతాల్లో మెరుపు దాడులు నిర్వహించి సుమారు రూ. 34.12 కోట్ల విలువైన 3,041 గజాల పార్కు స్థలాలను కబ్జాదారుల చెర నుంచి విడిపించింది. హైడ్రా తీసుకున్న ఈ చర్యలతో స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, కుత్బుల్లాపూర్ పరిధిలోని సుభాష్ నగర్‌లో ఉన్న భాగ్యలక్ష్మి కాలనీలో హైడ్రా అధికారులు కీలక ఆపరేషన్ చేపట్టారు. 1968లో వేసిన ఈ లేఅవుట్‌లో పార్కుల కోసం కేటాయించిన స్థలాలు కాలక్రమేణా కబ్జాకు గురయ్యాయి. గతంలో ఈ ప్రాంతం మీదుగా వెళ్లే హైటెన్షన్ విద్యుత్ లైన్లను 20 ఏళ్ల క్రితం తొలగించడంతో, అప్పటి నుంచి పార్కుల స్థలాలు ఆక్రమణకు గురవుతూ వచ్చాయి. స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో, నివాసితులు హైడ్రా ప్రజావాణిని ఆశ్రయించారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన అధికారులు, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఆక్రమణలను నిర్ధారించుకున్నారు. శుక్రవారం ఒకేసారి 6 పార్కులలోని ఆక్రమణలను తొలగించి, 2260 గజాల స్థలానికి 'హైడ్రా ఫెన్సింగ్' వేసి, అధికారిక బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో కాలనీవాసులు ఆనందంతో ర్యాలీలు తీసి, హైడ్రాకు అనుకూలంగా నినాదాలు చేశారు. ఇదే తరహాలో, ఆసిఫ్‌నగర్ మండలం గుడిమల్కాపూర్ గ్రామంలోని ఏజీ ఆఫీస్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేఅవుట్‌లో దశాబ్దాలుగా కబ్జాలో ఉన్న పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడింది. గతంలో లోతట్టు ప్రాంతంగా ఉన్న ఈ 1,152 గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. అయితే, కొందరు వ్యక్తులు దానిని ఆక్రమించుకుని ఇసుక వ్యాపారం, వాహనాల పార్కింగ్, కొబ్బరి బొండాల అమ్మకాలకు వినియోగిస్తున్నారు. 2018లో జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోవడంతో, స్థానికులు హైడ్రాను సంప్రదించారు. ప్రజావాణి ఫిర్యాదు ఆధారంగా హైడ్రా అధికారులు కబ్జాదారులను ఖాళీ చేయించి, స్థలాన్ని స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్ వేశారు. ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో హైడ్రా తన నిబద్ధతను చాటుకుంటోందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# మస్తు ఖుషీగా ఉన్నా

**కరీంనగర్ గెలుపు మహాశక్తి అమ్మవారికి అంకితం**

**కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆనందోత్సాహం**



కరీంనగర్, ఫిబ్రవరి 13 (ఈవార్తలు): కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో కాషాయ జెండా రెపరెపలాడింది. తెలంగాణలో బిజెపి తొలిసారి కరీంనగర్ కార్పొరేషన్ పైన కాషాయ జెండా ఎగురవేయడంతో కేంద్ర మంత్రి బండి సంజయ్ సంతోషం వ్యక్తం చేశారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు ఇచ్చిన స్ఫూర్తితో హైదరాబాద్లో కూడా కాషాయం జండా ఎగురవేస్తాం అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బీజేపీ విజయం చారిత్రాత్మకమన్నారు. ప్రజలు ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వాన్ని నమ్మి బీజేపీకి మద్దతు ఇచ్చారని చెప్పారు. ఈ ఎన్నికలలో తమను ఓడించడానికి కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం కలిసి కుట్రలు చేశాయని, డబ్బు పంపిణీ జరిగిందని, ఓటుకు ఏడు వేల రూపాయల చొప్పున ఇచ్చారని ఆరోపించారు. అయినా వాటిని ప్రజలు తిరస్కరించి బిజెపికి పట్టం కట్టారన్నారు. ఇదే సందర్భంగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పైన, అసదుద్దీన్ ఓవైసీ పైన కూడా బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఓవైసీ కళ్ళల్లో ఆనందం కోసమే జిహెచ్ఎంసి ముక్కలు చేశారని వచ్చే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో హైదరాబాద్ పైన కాషాయ జెండా ఎగురవేసి గట్టి దెబ్బ కొడతామన్నారు. హైదరాబాదులో రేవంత్ రెడ్డి చేసిన పని ఆయనకు మరణశాసనం కాబోతుందన్నారు. కాంగ్రెస్ తో సంసారం చేస్తూ బీఆర్ఎస్‌కు కన్ను కొడుతున్న ఎంఐఎం చెంప చెళ్ళుమనిపించారని బండి సంజయ్ అన్నారు. మొత్తం 66 డివిజన్లలో బీజేపీ బలమైన కార్యకర్తలకు టికెట్లు ఇచ్చి 33 స్థానాలు గెలుచుకుందని, మరికొన్ని తక్కువ తేడాతో కోల్పోయిందని వెల్లడించారు. ఇండిపెండెంట్లు కూడా తమకు మద్దతు ఇస్తున్నారని చెప్పారు. కరీంనగర్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం భారీ నిధులు కేటాయించిందని, భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కరీంనగర్ స్ఫూర్తితో హైదరాబాద్‌లోనూ కాషాయ జెండా ఎగరేస్తామని సవాల్ చేశారు. మోదీపై నమ్మకంతో గెలిపించిన కరీంనగర్ ప్రజలకు శిరస్సు వంచి వందనం చేస్తున్నా అన్నారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల విజయం తనకు పట్టరాని సంతోషాన్ని కలిగిస్తుంది అన్నారు. ఈ విజయం మహాశక్తి అమ్మవారికి అంకితం చేస్తున్నానని బండి సంజయ్ చెప్పారు. అవినీతి, అక్రమాలకు తావులేకుండా కరీంనగర్ ను అభివృద్ధి చేసి చూపిస్తాం అన్నారు. ప్రజల వద్దకే పాలనను తీసుకువెళతానని ఆయన అన్నారు. కరీంనగర్లో బీజేపీ విజయంతో కాషాయ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు.

# అక్రమ సరోగసీ డాక్టర్ అరెస్ట్

**డాక్టర్ నమ్రతను అరెస్ట్ చేసిన ఈడీ**

**మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు**

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (ఈవార్తలు): హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన అక్రమ సరోగసీ రాకెట్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కీలక చర్యలు చేపట్టింది. ఈ కేసుకు సంబంధించి మనీలాండరింగ్ ఆరోపణలపై డాక్టర్ అడుతూరు నమ్రత అలియాస్ పచ్చిపల్లి నమ్రతను శుక్రవారం అరెస్ట్ చేసింది. అనంతరం ఆమెను కోర్టులో హాజరుపరచగా, ఫిబ్రవరి 26 వరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ అండ్ రీసెర్చ్ సెంటర్ పేరుతో నమ్రత ఈ అక్రమ దందా నడిపినట్లు ఈడీ దర్యాప్తులో తేలింది. సంతానం లేని దంపతుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసి, వారికి సరోగసీ ద్వారా బిడ్డను అందిస్తామని నమ్మించేవారు. అయితే, పేదరికంతో బిడ్డలను పెంచుకోలేని గర్భిణులను ఏజెంట్ల ద్వారా గుర్తించి, పుట్టిన వెంటనే శిశువులను కొనుగోలు చేసేవారని ఈడీ ఆరోపించింది. ఆడశిశువుకు రూ. 3.5 లక్షలు, మగశిశువుకు రూ. 4.5 లక్షలు చెల్లించి, వారిని సంతానం లేని దంపతులకు అమ్మేవారని దర్యాప్తులో వెల్లడైంది. ఈ రాకెట్‌పై గతంలోనే హైదరాబాద్ గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో చీటింగ్, చైల్డ్ ట్రాఫికింగ్ వంటి అభియోగాలపై పలు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఆ కేసుల్లో 2025 నవంబర్‌లో బెయిల్‌పై విడుదలైన ఆమె, మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టిన ఈడీ విచారణకు సహకరించకపోవడంతో తాజాగా పీఎంఎల్ఏ చట్టం కింద అరెస్ట్ చేశారు. సికింద్రాబాద్‌లోని ఆసుపత్రి లైసెన్సు రద్దు కాగా, విశాఖపట్నం కేంద్రంగా ఈ దందాను కొనసాగించినట్లు ఈడీ గుర్తించింది. దంపతులనే అసలు తల్లిదండ్రులుగా చూపిస్తూ నకిలీ జనన ధృవపత్రాలు సృష్టించినట్లు కూడా ఈడీ తెలిపింది. ఈ రాకెట్‌లో ఏజెంట్లు, సబ్-ఏజెంట్ల నెట్‌వర్క్ కీలకంగా వ్యవహరించిందని, దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు వివరించారు.

# నల్లగొండ అంటేనే కాంగ్రెస్

**మరోసారి రుజువు చేశాం: మంత్రి కోమటిరెడ్డి**



నల్లగొండ, ఫిబ్రవరి 13 (ఈవార్తలు):
నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మక విజయం సాధించడం పట్ల రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు అఖండ మెజారిటీని కట్టబెట్టిన నల్లగొండ ప్రజలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా, నల్లగొండ పట్టణాన్ని హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజా పాలనకు ఈ గెలుపు నిదర్శనమని అన్నారు. నల్లగొండలో మొత్తం 48 వార్డులకు గాను కాంగ్రెస్ కు 27, బీఆర్ఎస్ కు 9, బీజేపీకి 4, ఇతరులకు 8 స్థానాలు దక్కాయి. ఈ విజయం ద్వారా "నల్లగొండ అంటే కాంగ్రెస్... కాంగ్రెస్ అంటే నల్లగొండ" అని ప్రజలు మరోసారి రుజువు చేశారని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థులందరికీ ఆయన అభినందనలు తెలిపారు. గెలుపొందిన కార్పొరేటర్లు ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. అదే సమయంలో, ఓటమి పాలైన అభ్యర్థులు నిరుత్సాహపడకుండా, తమ డివిజన్లలోని సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ఎజెండా అని స్పష్టం చేశారు. నల్లగొండ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు మంత్రి ప్రకటించారు. ఇకపై వారానికి రెండు రోజులు తాను నల్లగొండలోనే అందుబాటులో ఉండి, ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. అంతేకాకుండా, ప్రతి డివిజన్‌లో ప్రజా దర్బార్ నిర్వహించి, క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకుని తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని భరోసా ఇచ్చారు.

# మా గెలుపుతో కవితకు సంబంధం లేదు

**వడ్డేపల్లి శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు**

గద్వాల, ఫిబ్రవరి 13 (ఈవార్తలు): తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత మద్దతు పలికిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన అభ్యర్థులు విజయకేతనం ఎగురవేశారు. మొత్తం 10 వార్డులకు గాను 8 వార్డుల్లో సింహం గుర్తుపై గెలిచి సంచలనం సృష్టించారు. ఈ గెలుపు చర్చనీయాంశంగా మారుతున్న వేళ, కవిత విజయం గురించి చర్చ ప్రారంభమైన వేళ... ఆమెకు షాక్ తగిలింది. తమ విజయంతో కవితకు ఎలాంటి సంబంధం లేదని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తరపున గెలిచిన వడ్డేపల్లి శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ఓ న్యూస్ చానల్ తో వడ్డేపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ... తమ విజయంతో జాగృతికి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి బీఫారం తీసుకోవడానికి వెళ్లినప్పుడు కవిత తమకు జాగృతి కండువా కప్పారని... కానీ, ఆమె తమ తరపున ప్రచారానికి వచ్చిందే లేదని చెప్పారు. ప్రచారంలో తాము కవిత కండువా వేసుకున్నది కూడా లేదని, ఆ రోజు తర్వాత కవితతో తాము మాట్లాడింది కూడా లేదని తెలిపారు. ఈ గెలుపు తమ సొంతమని చెప్పారు. శ్రీనివాస్ వ్యాఖ్యలపై కవిత ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

# తెలుగు మీడియం టు డాక్టరేట్

**పట్టువదలని దామెర తిరుపతి**

**కెమిస్ట్రీలో ఓయూ నుంచి పీహెచ్‌డీ పట్టా**

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (ఈవార్తలు): కష్టపడి చదివితే అసాధ్యం అనేది లేదు.. ప్రతీది సాధ్యమే.. మనం తెలుగు మీడియం లో చదివాం కాబట్టి ఈ సమాజంలో ఇంగ్లిష్ బాగా మాట్లాడలేమేమో, చదువులో రాణించలేమెమో అనే ఆత్మన్యూనతాభావం మనల్ని వెనక్కి లాగేస్తుంది. కానీ, ఆ సమస్యను దాటుకొని డాక్టరేట్ సాధించారు దామెర తిరుపతి. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. ఉస్మానియా యూనివర్సిటీ కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం వాసవి పర్యవేక్షణలో 'అణు నిర్మాణ నమూనా విధానాలను ఉపయోగించి కొత్త ప్రధాన ఔషధ అణువులను రూపకల్పన చేయడం-టీబీ వ్యాధిపై పరిశోధన'పై రిసెర్చ్ చేసి, డాక్టర్ తిరుపతి అయ్యారు. పీహెచ్‌డీ పట్టా సాధించిన క్రమంలో తిరుపతికి అభినందనలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఈ రోజు నేను గెలిచాను. కాదు.. మా అమ్మ నాన్న, కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహా ఉపాధ్యాయులు నన్ను గెలిపించారు' అని సంతోషం వ్యక్తం చేశారు.



# కర్క ముత్తారెడ్డి స్మారక జాతీయస్థాయి కవితల పోటీలు

వసుంధర విజ్ఞాన వికాస మండలి (రిజిస్టర్డ్) ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు కర్కముత్తారెడ్డి స్మారకార్థం గత కొన్నేండ్లుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి వచన కవితల పోటీలు ఈ ఏడాది కూడా నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు గాను పదవతరగతి లోపు విద్యార్థినీ, విద్యార్థులు ఒక విభాగంగా, అన్నివయసుల వారు మరో విభాగంగా నిర్ణయించారు. ప్రతి విభాగం నుంచి 5 కవితల చొప్పున మొత్తం 10 ఉత్తమ కవితలకు నగదు బహుమతులు అందజేస్తారు.




- పదవతరగతి లోపువారికి అంశం-: అనాధశ్రయాలకు అమ్మనాన్నలు
- విద్యార్థులు ప్రస్తుతం పదవతరగతి లోపు చదువుతుండాలి.
- వారి విద్యార్హతలు దృవీకరిస్తూ ప్రధానోపాధ్యాయుని సంతకంతో కూడిన లెటర్ తప్పనిసరి
- అన్ని వయసుల వారికి అంశం : కుప్పకూలుతున్న ఆలుమగల అనుబంధాలు
- కవిత మీ స్వంతం అనే హామీపత్రం తప్పనిసరి
- రెండు విభాగాల్లో ఒకరు ఒక కవిత మాత్రమే పంపాలి.
- ప్రతి కవిత 20 నుంచి 30 లైన్లలోపు మాత్రమే ఉండాలి (దీర్ఘకవితలు స్వీకరించం)
- కవితలు పోస్టుద్వారా మాత్రమే పంపించాలి. ఇతరాత్ర కవితలు స్వీకరించబడవు
- పోటీల నిర్వహణ, రద్దు విషయాల్లో తుదినిర్ణయం సంస్థదే
- కవితలు పంపాల్సిన చివరితేది 25.02.26
- కవితలు పంపాల్సిన చిరునామా : కన్వీనర్, వసుంధర విజ్ఞాన వికాస మండలి (రిజిస్టర్డ్), ఇ,నెం- : 13-3/3/6/2జు, అవంతినగర్ తోట, మోతీనగర్, హైదరాబాద్ -500018. సంప్రదించాల్సిన పోన్ నెంబర్ 8096677409.



# మల్యాలలో ఘనంగా శివ పార్వతుల కల్యాణం

మల్యాల, ఫిబ్రవరి 13 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం కేంద్రంలో శుక్రవారం శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను స్థానిక మార్కండేయ గుడి నుంచి మంగళ వాయిద్యాలతో ఎదురుకొచ్చి శివాలయం ముందు పచ్చని పందిట్లో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. దేవదేవుల కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పలువురు మహిళలు ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

## రామాయంపేటలో భార్యాభర్తల విజయం

రామాయంపేట, ఫిబ్రవరి 13 (ఈవార్తలు): సంగారెడ్డి జిల్లాలోని రామాయంపేట మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ఇక్కడ భార్యాభర్తలైన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు రెండు వార్డుల నుంచి విజయం సాధించడం గమనార్హం. ఓ వార్డు నుంచి బెజవాడ నాగరాజు 126 ఓట్ల మెజార్టీతో సమీప అభ్యర్థిపై విజయం సాధించగా, మరో వార్డు నుంచి నాగరాజు భార్య లావణ్య 281 ఓట్ల మెజార్టీతో గెలిచారు.

## ఒక్క ఓటుతో వరించిన విజయం



కల్వకుర్తి, పరకాల ఫిబ్రవరి 13 (ఈవార్తలు): కల్వకుర్తి మున్సిపాలిటీలోని పదో వార్డులో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్య విజయం దోబూచులాడింది. తొలుత కాంగ్రెస్ అభ్యర్థి ఎజాస్ కు రెండు ఓట్ల మెజారిటీ రాగా బీఆర్ఎస్ అభ్యర్థి తాహిర్ రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో అధికారులు మరోసారి ఓట్లు లెక్కించగా.. ఎజాస్ కు 259 ఓట్లు, తాహిర్ కు 258 ఓట్లు వచ్చాయి. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి ఎజాస్ గెలుపొందినట్లు అధికారులు ప్రకటించారు. అటు పరకాల మున్సిపాలిటీలోని 17వ వార్డు ఫలితాల్లో కాంగ్రెస్ అభ్యర్థి బొచ్చు సుభద్రకు 369 ఓట్లు పోలవగా.. బీఆర్ఎస్ అభ్యర్థి శనిగరపు రజినికి 368 ఓట్లు వచ్చాయి. దీంతో రజిని రీకౌంటింగ్ కు దరఖాస్తు చేసుకోగా రెండోసారి కౌంటింగ్ చేసినా ఫలితంలో మార్పులేదు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి బొచ్చు సుభద్ర గెలుపొందినట్లు అధికారులు ప్రకటించారు.




## వచ్చేది వేసవి.. నిప్పుతో జాగ్రత్త: రంగనాథ్

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (ఈవార్తలు): రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. నిప్పుతో ఊహించని ప్రమాదం పొంచి ఉంటుందని, ప్రతిఒక్కరూ అగ్నిమాపక నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఓ అవగాహనా కార్యక్రమంలో ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ, "కేవలం 30 సెకన్ల వ్యవధిలోనే మంటలు వేగంగా వ్యాపించే అవకాశం ఉంది. నగరంలో గతంలో జరిగిన అనేక అగ్ని ప్రమాదాలను విశ్లేషిస్తే, నిబంధనలను ఉల్లంఘించడమే ప్రధాన కారణంగా స్పష్టమవుతోంది" అని తెలిపారు. వేసవిలో పొడి వాతావరణం కారణంగా ప్రమాద తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఈ నేపథ్యంలో హైడ్రా అగ్ని ప్రమాదాల నివారణపై ప్రత్యేకంగా దృష్టి సారించిందని కమిషనర్ వివరించారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. నిబంధనలను తు.చ. తప్పకుండా పాటిస్తేనే ప్రమాదాలను నివారించగలమని, తద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని అరికట్టవచ్చని ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు.

## మంచిర్యాలలో మంత్రి వివేక్‌కు భంగపాటు

మంచిర్యాల, ఫిబ్రవరి 13 (ఈవార్తలు): మంచిర్యాల జిల్లా రాజకీయాల్లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి సొంత నియోజకవర్గం చెన్నూర్ పరిధిలోని క్యాతనపల్లి మున్సిపాలిటీని బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంది. హోరాహోరీగా సాగిన ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బీఆర్ఎస్, సీపీఐ పార్టీలు ముందస్తు పొత్తుతో ఎన్నికలకు వెళ్లడం ఇక్కడ ప్రధానంగా కలిసివచ్చింది. ఈ రెండు పార్టీల బలం కలిపి 14 సీట్లకు చేరడంతో మున్సిపల్ పీఠం దక్కించుకోవడం సులువైంది. మొత్తం 22 వార్డులు ఉన్న క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ 10 వార్డులు, కాంగ్రెస్ 7 వార్డులు, సీపీఐ 4 వార్డులు, ఇండిపెండెంట్ ఒక వార్డులో విజయం సాధించారు. కేడర్‌ను సమన్వయం చేయడంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విజయవంతమయ్యారు. నియోజకవర్గంలో పట్టు కోల్పోకుండా ఆయన వ్యూహాత్మకంగా అడుగులు వేయడంతో అక్కడ బీఆర్ఎస్ జెండా ఎగిరింది. మంత్రి వివేక్ ఇలాకా కావడంతో కాంగ్రెస్ పార్టీ ఈ మున్సిపాలిటీని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. అయితే, క్షేత్రస్థాయిలో సీపీఐతో పొత్తు కుదరకపోవడం, స్వతంత్ర అభ్యర్థుల ప్రభావం కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు అవకాశాలను దెబ్బతీశాయి. ఈ ఓటమిని కాంగ్రెస్ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి.

# జగిత్యాలలో స్వతంత్రుల హవా

**జీవన్ రెడ్డి అనుచరుల ప్రభంజనం**

**ఏకంగా 14 వార్డుల్లో ఇండిపెండెంట్స్ గెలుపు**

జగిత్యాల, ఫిబ్రవరి 13 (ఈవార్తలు): తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో జగిత్యాల మున్సిపాలిటీ వేదికగా పెను సంచలనం నమోదైంది. ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు గట్టి పోటీనిస్తూ స్వతంత్ర అభ్యర్థులు అత్యధిక స్థానాలను కైవసం చేసుకున్నారు. సీనియర్ నేత జీవన్ రెడ్డి అనుచరులు స్వతంత్రులుగా బరిలోకి దిగి సత్తా చాటడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీ టికెట్ దక్కకపోవడంతో రెబల్స్‌గా, స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగిన జీవన్ రెడ్డి అనుచరులు ఏకంగా 14 వార్డుల్లో విజయం సాధించి కింగ్ మేకర్లుగా అవతరించారు. దీంతో జగిత్యాల మున్సిపల్ పీఠాన్ని దక్కించుకోవడంలో వీరి మద్దతు అత్యంత కీలకంగా మారనుంది. అధికార కాంగ్రెస్ పార్టీ కేవలం 12 స్థానాలకే పరిమితం కాగా, బీఆర్ఎస్, బీజేపీ నామమాత్రపు స్థానాలకే పరిమితమయ్యాయి. ఎంఐఎం రెండు వార్డుల్లో తన ఉనికిని చాటుకుంది. ఇప్పుడు ఈ స్వతంత్ర అభ్యర్థులు ఏ పార్టీకి మద్దతు ఇస్తారనే దానిపై మున్సిపల్ చైర్మన్ పీఠం ఆధారపడి ఉంది.



# పంచాయతీ కార్యదర్శులకు డిప్యూటేషన్లు



హైదరాబాద్, ఫిబ్రవరి 13 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారంలో మరో కీలక నిర్ణయం తీసుకుంది. గత ప్రభుత్వంలో జారీ చేసిన జీవో నెం.317 కారణంగా స్థానికత కోల్పోయి దూర ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న 223 మంది పంచాయతీ కార్యదర్శులకు రెండు సంవత్సరాల పాటు అంతర్ జిల్లా డిప్యూటేషన్‌పై నియామకానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయం వెనుక పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క కీలక పాత్ర పోషించారు. జీవో 317 వల్ల ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సీరియస్‌గా తీసుకున్న మంత్రి సీతక్క, పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రతినిధులతో సమావేశమై వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అనంతరం అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి పరిష్కార ప్రక్రియను వేగవంతం చేశారు. జీవో 317 వల్ల జరిగిన నష్టాలను సరిదిద్దేందుకు కేబినెట్ సబ్ కమిటీ సిఫార్సుల మేరకు ప్రభుత్వం జీవో 190 జారీ చేసింది. ఆ నిర్ణయానికి అనుగుణంగా అంతర్ జిల్లా డిప్యూటేషన్ ప్రక్రియను ప్రారంభించిన తొలి శాఖగా పంచాయతీ రాజ్ శాఖ నిలవడం మంత్రి సీతక్క కృషికి నిదర్శనం. ఖాళీలున్న ప్రాంతాల్లో అవసరానికి అనుగుణంగా డిప్యూటేషన్లకు అనుమతులిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో పరిపాలన బలోపేతం చేయడం, సిబ్బందికి న్యాయం చేయడం ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల ఉద్యోగులకు జరిగిన అన్యాయాలను సరిదిద్దుతూ, పారదర్శకంగా, న్యాయబద్ధంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ నిర్ణయంతో పంచాయతీ కార్యదర్శులకు గణనీయమైన ఉపశమనం లభించడంతో పాటు, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలుకానున్నాయి. మంత్రి సీతక్క నాయకత్వంలో పంచాయతీ రాజ్ శాఖ సిబ్బంది సంక్షేమం మరియు గ్రామీణ పరిపాలన బలోపేతానికి కట్టుబడి ఉందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయంపై రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. తమ సమస్యలను సానుకూలంగా పరిగణించి వేగంగా పరిష్కరించిన తెలంగాణ ప్రభుత్వం, మంత్రి సీతక్కకు సంఘాల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. స్థానికత కోల్పోయి కుటుంబాలకు దూరంగా పనిచేస్తూ ఇబ్బందులు ఎదుర్కొన్న పంచాయతీ కార్యదర్శులకు ఈ నిర్ణయం ఎంతో ఊరట కలిగించిందని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలను అర్థం చేసుకుని న్యాయం చేసిన మంత్రి సీతక్కకు, శాఖ అధికారులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియ చేశారు.

## కేసుల కోసమా మీకు అధికారం? : బొత్స

అమరావతి, ఫిబ్రవరి 13 (ఈవార్తలు): కూటమి ప్రభుత్వానికి అధికారం ఇచ్చింది ఇష్టమొచ్చినట్లు కేసులు పెట్టడానికా? అని కూటమి సర్కారును బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. ఆయన మండలిలో మాట్లాడుతూ 'అంబటి రాంబాబు పై దాడి చేస్తే.. ఆయన కొన్ని మాటలు అన్నారు. ఆ తరువాత అంబటి రాంబాబు తన వ్యాఖ్యల పై పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. అంబటి రాంబాబు విజ్ఞత కలిగిన వ్యక్తి...అందుకే ఆయన క్షమాపణ చెప్పారు. అంబటిని వేధించినందుకు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకుంటారు. ప్రజా స్వామ్యంలో దాడులు చేయడం తప్పు కాదా..??, మరోమాజీ మంత్రి ఇంటి మీద పెట్రోల్ బాంబులు వేశారు. రాజకీయాల్లో మహిళలను తీసుకు వచ్చి మైలేజ్ కోసం చూస్తున్నారు. అంబటి రాంబాబు తల్లి తల్లి కాదా?, అంబటి రాంబాబు తల్లిని తిడితే ఒకటి.. మీ తల్లిని అంటే ఒకటా...?, తల్లి ఎవరికైనా తల్లే. మీకు అధికారం ఇచ్చింది ఇష్టం వచ్చినట్లు కేసులు పెట్టమనా..?, మహిళ విషయంలో ఎవరు తప్పు చేసినా తప్పే. అంబటి రాంబాబు తాను చేసిన కామెంట్స్ పై క్షమాపణ చెప్పారు. అంబటి రాంబాబు తల్లిని దూషించిన వీడియోలు ఉన్నాయి' అని పేర్కొన్నారు.

## తిరుమలలో అన్ని కంపార్టుమెంట్లు ఫుల్

తిరుమల, ఫిబ్రవరి 13 (ఈవార్తలు): వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులతో తిరుమల గిరులు కిటకిటలాడుతున్నాయి. శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులతో అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోందని టీటీడీ అధికారులు తెలిపారు. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు కలిగిన వారి దర్శనానికి 5 గంటల సమయం పడుతోంది. టోకెన్లు కలిగిన భక్తులు వారికి నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ సూచించింది. గురువారం స్వామి వారిని 61,632 మంది భక్తులు దర్శించుకున్నారు. మొత్తం 24,435 మంది తలనీలాలు సమర్పించారు. కానుకల ద్వారా హుండీకి రూ. 3.28 కోట్ల ఆదాయం వచ్చింది.



## ఏపీలో నీట్ ఆధారంగా నర్సింగ్ ప్రవేశాలు

విజయవాడ, ఫిబ్రవరి 13 (ఈవార్తలు): విద్యా రంగానికి సంబంధించి ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలను నీట్-యూజీ పరీక్ష ఆధారంగా నిర్వహించాని నిర్ణయించింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ ప్రతిపాదనలకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదముద్ర వేశారు. 2026-27 విద్యా సంవత్సరానికి గాను నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నీట్ పరీక్షను విద్యార్థులు రాయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఉన్నతాధికారులతో ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. నర్సింగ్ ప్రవేశాలకు ఉత్తమ విధానంపై చర్చించారు. అనంతరం నీట్ పై కీలక నిర్ణయం తీసుకున్నారు.

## మణిపూర్‌లో మళ్లీ హింస

న్యూఢిల్లీ: ఆందోళనలతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో మరోసారి హింస చెలరేగింది. గురువారం ఉఖ్రుల్ జిల్లాలోని, లిటన్ ఏరియాలో ఆందోళనకారులు రెండు ఇండ్లను తగలబెట్టారు. స్థానికంగా ఉన్న సరీఖాంగ్ గ్రామంలో గురువారం ఉదయం ఏడు గంటల సమయంలో ఈ హింసాత్మక ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. అంతకుముందు 24



గంటలపాటు మణిపూర్‌లో ప్రశాంత వాతావరణమే కొనసాగింది. కానీ, గురువారం తిరిగి హింస చెలరేగింది. ఒకవైపు కేంద్ర, రాష్ట్ర భద్రతా బలగాలు మోహరించి ఉన్నప్పటికీ కొన్ని చోట్ల ఆందోళనలు ఆగడం లేదు. మరోవైపు ఉదయం ఎనిమిది గంటల సమయంలో తుపాకీ కాల్పుల మోతలు కూడా వినిపించాయని పోలీసులు తెలిపారు. అయితే, ఎవరూ గాయపడటం లేదా మరణించడం వంటివి తమ దృష్టికి రాలేదన్నారు. తాజా హింసకు ఈ ప్రాంతంలోని రెండు వర్గాలకు చెందిన వారు మద్యం సేవించడమే కారణం. ఆదివారం రాత్రి తంకుల్ నాగా, కుకీ తెగలకు చెందిన వారు మద్యం మత్తులో గొడవపడ్డారు. సమీప గ్రామాలకు చెందిన ఈ రెండు వర్గాల వారి మధ్య చెలరేగిన ఘర్షణ తీవ్ర రూపం దాల్చింది. ఈ హింసలో ఇరు వర్గాలకు చెందిన 40 ఇండ్లను ఆందోళనకారులు దహనం చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు ఈ ప్రాంతంలో ఘర్షణలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా కర్ఫ్యూ విధించారు. లిటన్ ఏరియాతోపాటు జిల్లా మొత్తం ఇంటర్నెట్ తొలగించారు. అయినప్పటికీ కుకీ తెగకు చెందిన మహిళలు చురాచంద్‌పూర్ జిల్లాలో భారీ నిరసనలు చేశారు. స్థానిక ఎమ్మెల్యే ఎల్ఎం ఖవుతే ప్రభుత్వంలో చేరడాన్ని వారు వ్యతిరేకిస్తున్నారు. ఇంకా అనేక చోట్ల నిరసనలు జరుగుతున్నాయి.

## మన భాషతో



# ఏఐ దోస్త్!

### కృత్రిమ మేధతో భాషా పరిరక్షణ

### అధునాతన సాంకేతికతను వినియోగిస్తున్న కేంద్రం

### భాష, సంస్కృతుల అభ్యున్నతికి ఏఐ వేదికలు




**భిన్న సంస్కృతులు, బహుభాషలకు భారత్ కేంద్రం. భిన్నత్వంలో ఏకత్వమే దేశ బలం. ఇందుకు తగ్గట్టుగానే కేంద్ర ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలు ఉంటాయి. అన్ని భాషలు, సంస్కృతులకు కేంద్రం పెద్దపీట వేస్తూ నిర్ణయాలు తీసుకుంటూ ఉంటుంది. దేశ సంస్కృతులు, భాషల అభివృద్ధి, పరిరక్షణకు కృత్రిమ మేధ(ఏఐ)ను కేంద్రం సద్వినియోగం చేస్తోంది. ఏఐ ద్వారా తాళపత్ర గ్రంథాలు, జానపదాలను భద్రపరిచి సంస్కృతిని పదిలం చేస్తోంది. భారతీయ భాషల అనువాదానికి సైతం ఏఐ వేదికలను ఏర్పాటుచేసి దేశ ప్రజలు పరస్పరం అర్థం చేసుకునేందుకు కృషి చేస్తోంది.**



**భాష ఏదైనా భాషిణితో అనువాదం**

భారతీయ భాషలను సులువుగా అనువాదం చేసేలా 2022లో కేంద్రం జాతీయ భాషా అనువాద మిషన్(ఎన్ఎల్‌టీఎం)ను ప్రారంభించింది. ఇందులో భాగంగా భాషిణి అనే బహుభాషా ఏఐ అనువాద వేదికను అందుబాటులోకి తెచ్చింది. భాషిణి ద్వారా 22 భాషల్లో మాటలను, 36 భాషల్లో టెక్స్ట్‌ను అనువాదం చేయవచ్చు. కాశీ తమిళ సంగమం కార్యక్రమంలో ప్రధాని మోదీ భాషిణి ద్వారానే తన హిందీ ప్రసంగాన్ని తక్షణం తమిళంలో అనువదించారు. మహాకుంభమేళలో భాషిణి ద్వారా పనిచేసే కుంభ్ సహాయక్ చాట్‌బాట్‌ను 11 భాషల్లో అందుబాటులోకి తెచ్చి యాత్రికులకు సేవలందించారు.

**ఏఐసీటీఈ అనువాదిని**

విద్య, సాంకేతికత, జ్ఞాన సంబంధ కంటెంట్‌ను పెద్ద ఎత్తున అనువాదం చేసేందుకు వీలుగా ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ) అనువాదిని అనే ఏఐ ఆధారిత అనువాద వేదికను తయారుచేసింది. విద్యార్థులు తమ సొంత భారతీయ భాషల్లో పాఠ్యాంశాలను అనువాదం చేసుకుని చదివేందుకు ఇది వీలు కల్పిస్తోంది.

**గిరిజన భాషల కోసం ఆది వాణి**

గిరిజన భాషల పరిరక్షణ, ప్రోత్సాహం కోసం కేంద్రం ఆది వాణి అనే ఏఐ వేదికను అభివృద్ధి చేసింది. హిందీ, ఇంగ్లీష్, గిరిజన భాషల మధ్య తక్షణ అనువాదానికి ఇది వీలు కల్పిస్తుంది. గిరిజన భాషలను ఇతరులు అర్థం చేసుకునేందుకు, ఇతర భాషలను గిరిపుత్రులు అర్థం చేసుకునేందుకు ఆది వాణి ఏఐ పోర్టల్, యాప్ ఉపయోగపడుతుంది.

**జ్ఞాన భారతం మిషన్**

భారతీయ పురాతన గ్రంథాలు, సంప్రదాయ జ్ఞాన వ్యవస్థల సర్వే, డాక్యుమెంటేషన్, డిజిటలీకరణ, ప్రచారం కోసం కేంద్రం 2024-31 మధ్య అమలు చేసేందుకు రూ.482.85 కోట్లతో జ్ఞాన భారతం మిషన్‌ను చేపట్టింది. ఈ మిషన్ కోసం ఏఐని వినియోగిస్తోంది. ఇప్పటివరకు 44 లక్షల గ్రంథాలను కృతిసంపద అనే డిజిటల్ వేదికలో భద్రపరిచింది.

Anuvadini Translation

# ఇరాన్ దిశగా అమెరికా సేనలు!

**అణు చర్చలు విఫలమైతే సైనిక చర్య?**



టెహ్రాన్: అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరుకుంటున్న వేళ, ట్రంప్ ప్రభుత్వం తమ సైనిక శక్తిని ప్రదర్శిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రపంచంలోనే అతిపెద్ద విమాన వాహక నౌక అయిన యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్. ఫోర్డ్‌ను కరేబియన్ సముద్రం నుంచి మధ్యప్రాచ్యం వైపు తరలిస్తోంది. ఇరాన్‌పై సైనిక ఒత్తిడిని మరింత పెంచేందుకే ఈ చర్య తీసుకున్నట్టు అంతర్జాతీయ మీడియా వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇరాన్‌తో అణు కార్యక్రమంపై చర్చలు విఫలమైతే సైనిక చర్యకు వెనుకాడబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవలే హెచ్చరించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ప్రస్తుతం ఒమన్ వేదికగా ఇరు దేశాల మధ్య పరోక్షంగా చర్చలు జరుగుతున్నాయి. ఈ చర్చలు కొలిక్కి రాకపోతే దాడులకు దిగేందుకైనా సిద్ధమేనని అమెరికా సంకేతాలిస్తున్నట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. పశ్చిమాసియాలో ఇప్పటికే యూఎస్ఎస్ అబ్రహం లింకన్ విమాన వాహక నౌక సమూహం మోహరించి ఉంది. ఇప్పుడు జెరాల్డ్ ఫోర్డ్ కూడా చేరనుండటంతో ఆ ప్రాంతంలో అమెరికాకు చెందిన రెండు శక్తివంతమైన విమాన వాహక నౌకలు అందుబాటులో ఉంటాయి. న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రకారం, కరేబియన్‌లో ఉన్న జెరాల్డ్ ఫోర్డ్ స్ట్రైక్ గ్రూప్... అట్లాంటిక్ మహాసముద్రం, మధ్యధరా సముద్రం మీదుగా పర్షియన్ గల్ఫ్ వైపు పయనిస్తోంది. ఈ నౌకతో పాటు యూఎస్ఎస్ ఫ్రాంక్ ఈ. పీటర్సన్ జూనియర్, యూఎస్ఎస్ స్ప్రూయాన్స్, యూఎస్ఎస్ మిషెల్ మార్ఫీ వంటి అత్యాధునిక డిస్ట్రాయర్లు కూడా ఈ బృందంలో ఉన్నాయి. ఈ విమానవాహక నౌక మే నెల ఆరంభం వరకు మధ్యప్రాచ్యంలోనే ఉండే అవకాశం ఉందని, దీంతో దీని మోహరింపు కాలం 10 నెలలకు పొడిగించవచ్చని తెలుస్తోంది. గతంలో వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను బంధించేందుకు అమెరికా చేపట్టిన సైనిక చర్యలో జెరాల్డ్ ఫోర్డ్ నుంచే యుద్ధ విమానాలు పాల్గొన్నాయని నివేదికలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై సైనిక ఒత్తిడిని తీవ్రతరం చేసేందుకే అమెరికా ఈ చర్య తీసుకుందని అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ భారీ యుద్ధ నౌక తరలింపు పశ్చిమాసియాలో కొత్త ఆందోళనలకు దారితీస్తోంది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగితే పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం ఉందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.

## నమ్మకంతోనే జీవిస్తున్నా: డీకే



బెంగళూరు: కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై జరుగుతున్న చర్చల నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను ఎప్పుడూ నమ్మకంతోనే జీవిస్తున్నానని, కష్టపడి పనిచేస్తే ఫలితం తప్పకుండా వస్తుందని అన్నారు. "శ్రమ ఎక్కడ ఉంటుందో, అక్కడ ప్రతిఫలం ఉంటుంది. భక్తి ఎక్కడ ఉంటుందో, అక్కడ భగవంతుడు ఉంటాడు," అని ఆయన శుక్రవారం వ్యాఖ్యానించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో, ఆ తర్వాత టిప్టూరులో విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆయన ఈ విధంగా స్పందించారు. ఢిల్లీ పర్యటన తర్వాత మీలో విశ్వాసం పెరిగిందా అని ప్రశ్నించగా, పై వ్యాఖ్యలనే పునరుద్ఘాటించారు. అధికార మార్పిడిపై చర్చించేందుకు ఫిబ్రవరి 17న మిమ్మల్ని, సీఎం సిద్ధరామయ్యను హైకమాండ్ ఢిల్లీకి పిలిచిందనే వార్తలపై స్పందిస్తూ.. "ఆ విషయం నాకు తెలియదు. కాలమే సమాధానం చెబుతుంది," అని అన్నారు. ఇదే అంశంపై హోంమంత్రి పరమేశ్వర అధిష్ఠానాన్ని వివరణ కోరతానన్న దానిపై "ఆయనకు మంచి జరగాలి" అని బదులిచ్చారు. కొందరు ఎమ్మెల్యేలు విదేశీ పర్యటనకు వెళ్తున్నారనే దానిపై నివేదిక కోరారా అని అడగ్గా, తాను ఎలాంటి నివేదిక కోరలేదని, ఆ సమాచారం తెలుసుకునే ప్రయత్నం కూడా చేయలేదని స్పష్టం చేశారు. "నేను పార్టీకి క్రమశిక్షణ గల సైనికుడిని. పార్టీ ఏది చెబితే దానికి కట్టుబడి ఉంటాను. మిగతా ఏ విషయాల్లోనూ జోక్యం చేసుకోను. ఎమ్మెల్యేలు ఏమైనా సమస్యలు లేవనెత్తితే, వాటిని హైకమాండ్ నాయకులు, ముఖ్యమంత్రి చూసుకుంటారు," అని వివరించారు. ఇదిలా ఉండగా, డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావాలనేది తమ ఆకాంక్ష అని, రాష్ట్ర ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ఇదే కోరుకుంటున్నారని ఆయన మద్దతుదారు, ఎమ్మెల్సీ చెన్నరాజ్ హట్టిహోళి పేర్కొనడం గమనార్హం.

## వందేమాతరం మత స్వేచ్ఛకు విరుద్ధం

**కేంద్రం నిర్ణయంపై ముస్లిం సంఘాల అభ్యంతరం**

న్యూఢిల్లీ: వందేమాతరం పాటను తప్పనిసరి చేయాలనే కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనపై రాజకీయ, సామాజిక వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ముఖ్యంగా కొన్ని ముస్లిం సంస్థలు దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. జమీయత్ ఉలేమా-ఏ-హింద్ అధ్యక్షుడు మౌలానా అర్షద్ మదానీ మాట్లాడుతూ... వందేమాతరం పాటను తప్పనిసరి చేయడం రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛకు విరుద్ధమని అభిప్రాయపడ్డారు. ఇది అల్పసంఖ్యాకుల హక్కులపై ప్రతికూల ప్రభావం చూపే నిర్ణయమని అన్నారు. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ కూడా ఇదే అంశంపై స్పందిస్తూ విమర్శలు గుప్పించింది. ఈ సంస్థ జాతీయ ఉపాధ్యక్షుడు మౌలానా కౌసర్ హయాత్ ఖాన్ మాట్లాడుతూ... మత విశ్వాసాలకు విరుద్ధంగా ఉన్న అంశాల కారణంగా కొందరు ముస్లింలు వందేమాతరం పాడడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. స్వాతంత్ర్యానికి ముందే ఈ అంశంపై అభ్యంతరాలు ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. దేశంలో ఉన్న ముస్లింలందరినీ హిందువులుగా మార్చాలనుకుంటున్నారా? అని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి నిర్ణయాలను బలవంతంగా అమలు చేయడం దేశానికి కూడా మంచిది కాదని వ్యాఖ్యానించారు. కొందరు వ్యక్తులు తమ భావాలను ఇతరులపై బలవంతంగా రుద్దాలనుకోవడం సరికాదని అన్నారు.

## స్టాక్ మార్కెట్లకు భారీ నష్టాలు

ముంబై: భారత ఈక్విటీ మార్కెట్లు వరుసగా రెండో రోజు కూడా భారీ నష్టాల్లో ముగిశాయి. శుక్రవారం ట్రేడింగ్‌లో అమ్మకాల సునామీ వెల్లువెత్తడంతో సూచీలు కుప్పకూలాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కారణంగా భారత ఔట్‌సోర్సింగ్ మోడల్‌కు ముప్పు వాటిల్లుతుందనే అంతర్జాతీయ ఆందోళనలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 1,048 పాయింట్లు నష్టపోయి 82,626 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 336 పాయింట్లు పతనమై 25,471 వద్ద ముగిసింది. బెంచ్‌మార్క్ సూచీలతో పాటు మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 1.71 శాతం పడిపోగా, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 1.79 శాతం మేర క్షీణించింది. రంగాల వారీగా చూస్తే అన్ని సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. ముఖ్యంగా నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 3.31 శాతం పతనమై టాప్ లూజర్‌గా నిలిచింది. రియల్టీ, ఐటీ, ఎఫ్ఎంసీజీ రంగాలు కూడా భారీ నష్టాలను చవిచూశాయి. నిఫ్టీ 50లోని 44 షేర్లు నష్టాల్లో ముగియడం మార్కెట్ బలహీనతను సూచిస్తోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 6 పైసలు బలహీనపడి 90.61 వద్ద ట్రేడ్ అయింది. సాంకేతికంగా నిఫ్టీ తన కీలకమైన 21, 50, 100-రోజుల చలన సగటుల దిగువకు పడిపోయిందని విశ్లేషకులు తెలిపారు. "బ్యాంక్ నిఫ్టీ స్వల్పకాలిక కన్సాలిడేషన్ రేంజ్ నుంచి కిందకి జారింది. ఇది స్వల్ప లాభాల స్వీకరణను సూచిస్తుంది. అయితే, 59,700 వద్ద ఉన్న 20-రోజుల చలన సగటు కీలక మద్దతుగా కొనసాగుతోంది" అని ఎల్కేపీ సెక్యూరిటీస్ టెక్నికల్ అనలిస్ట్ వత్సల్ భువా వివరించారు.



## మోదీ కెరీర్‌పై ట్రంప్ కామెంట్స్


**నెట్టింట్లో వైరల్ అవుతున్న వీడియో**

వాషింగ్టన్: 'భారత ప్రధాని నరేంద్ర మోదీ రాజకీయ భవిష్యత్తు నాశనం చేయాలనుకోవడం లేదు' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. ఆ వీడియోను తాను చూడలేదని అన్నారు. కానీ ఆ వీడియో ఉంటే కనుక అది నిజమో కాదో తెలుసుకుని అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆంక్షలు ఉన్న నేపథ్యంలో రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడంపై గత ఏడాది భారత్ మీద ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలో అధ్యక్షుడు ట్రంప్ శ్వేతసౌధంలో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీని గొప్ప వ్యక్తి అంటూ ప్రశంసించారు. అదే సమయంలో మోదీ రాజకీయ జీవితంపై ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల భారత్, అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరిన నేపథ్యంలో ట్రంప్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంపై ఆయన స్పందించారు. గాజా పునర్నిర్మాణం కోసం ట్రంప్ ఏర్పాటు చేసిన 'శాంతి మండలి'లో చేరాలని ఆహ్వానం వచ్చిందని రణధీర్ జైస్వాల్ తెలిపారు. ఈ ప్రతిపాదనపై తాము ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని అన్నారు. అమెరికా నుంచి వచ్చిన ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఈ బోర్డుకు సంబంధించి ఫిబ్రవరి 19న జరిగే తొలి సమావేశానికి భారత్ హాజరవుతుందో లేదో ఆయన స్పష్టం చేయలేదు. అయితే పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం కోసం చేసే ప్రయత్నాలకు భారత్ ఎప్పుడూ మద్దతు ఇస్తుందని అన్నారు. గాజా సహా ఎక్కడైనా శాశ్వత శాంతికి మార్గం సుగమం చేసే అన్ని కార్యక్రమాలను ప్రధాని మోదీ స్వాగతించారని గుర్తు చేశారు.

# జడ్జిలపై ఫిర్యాదుల వెల్లువ

**సీజేఐ కార్యాలయానికి 8,360 కంప్లెయింట్లు**

**వెల్లడించిన కేంద్రం**



న్యూఢిల్లీ: గడిచిన గత పదేళ్ల కాలంలో సుప్రీంకోర్టు, హైకోర్టు సిట్టింగ్ న్యాయవాదులపై సుమారు 8,360 చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా కార్యాలయానికి ఫిర్యాదులు అందినట్లు కేంద్రం అధికారికంగా ప్రకటించింది. 2024లో అత్యధికంగా 1,170 ఫిర్యాదులు, 2025లో 1,102 ఫిర్యాదులు నమోదయ్యాయి అవినీతి, లైంగికపరమైన, ఇతర తీవ్రమైన అంశాల్లో సుప్రీం కోర్టు సిట్టింగ్ న్యాయమూర్తులు,హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తులపై ఫిర్యాదులు ఏమైనా వచ్చాయా? గత పదేళ్ల కాలంలో ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి.సంబంధిత ఫిర్యాదుల విషయంలో ఎలాంటి మెకానిజం పనిచేస్తుంది?' అంటూ లోక్‌సభలో ద్రవిడ మున్నేట్ర కజగం ఎంపీ మాథేశ్వరన్ వీఎస్ లిఖిత పూర్వకంగా సమాధానం ఇవ్వాలని న్యాయ శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ కోరారు. అందుకు కేంద్ర సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ వివరణ ఇచ్చారు. గడిచిన పదేళ్ల కాలంలో సుప్రీం కోర్టు ఆఫ్ ఇండియాకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు న్యాయమూర్తులపై 8,630 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ సందర్భంగా ఏ సంవత్సరంలో ఎన్ని ఫిర్యాదులు అందాయి. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తుల కాలంలో వచ్చిన ఫిర్యాదుల వివరాల్ని వెల్లడించారు. అనంతరం, న్యాయమూర్తులపై ఫిర్యాదులను సేకరించడానికి కేంద్రీకృత ప్రజా ఫిర్యాదుల పరిష్కారం పర్యవేక్షణ వ్యవస్థ (జూ+=ూమీూ) కాకుండా ప్రభుత్వానికి మరేదైనా యంత్రాంగం ఉందా? జవాబుదారీతనం నిర్ధారించడానికి అటువంటి ఫిర్యాదులను క్రమపద్ధతిలో నమోదు చేసి పర్యవేక్షించేలా మార్గదర్శకాలను జారీ చేయాలని ప్రతిపాదిస్తుందా? అని కూడా అడిగారు. ఈ ప్రశ్నకు సమాధానమిస్తూ, భారత ప్రధాన న్యాయమూర్తి సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తులపై ఫిర్యాదును కోర్టు 'ఇన్-హౌస్ ప్రొసీజర్' ద్వారా స్వీకరిస్తారని మేఘ్వాల్ అన్నారు. అదేవిధంగా, సంబంధిత హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తులపై ఫిర్యాదులను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్వీకరిస్తారని తెలిపారు. అయితే, సుప్రీంకోర్టు, హైకోర్టు సిట్టింగ్ జడ్జిలపై వచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకున్నారా? లేదా? వంటి వివరాల్ని వెల్లడించలేదు.

# ఆరావళి పర్వతాలను తాకనీయం

**హర్యానా సర్కారుకు సుప్రీం హెచ్చరిక**




న్యూఢిల్లీ: ఆరావళి పర్వతాల్ని తాకడానికి కూడా అనుమతించబోమని భారత సుప్రీం కోర్టు హెచ్చరించింది. ఆరావళి పర్వతాల పరిధిలో జూ సఫారి ఏర్పాటు చేయాలనే హర్యానా ప్రభుత్వ నిర్ణయాన్ని కోర్టు వ్యతిరేకించింది. అక్కడ ఎలాంటి చర్యలకు అనుమతించబోమని తేల్చిచెప్పింది. ఆరావళి పర్వాతాల పరిధిలో జూ సఫారి ఏర్పాటు చేయాలని హర్యానా ప్రభుత్వం నిర్ణయించింది. దీన్ని వ్యతిరేకిస్తూ 'పీపుల్స్ ఫర్ ఆరావళిస్' అనే స్వచ్ఛంద సంస్థ గత ఏడాది దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం విచారణ శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా కోర్టు తాజా నిర్ణయం తీసుకుంది. సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలితో కూడిన ధర్మాసనం తాజా వ్యాఖ్యలు చేసింది. ఆరావళి పరిధిలో, గుర్గావ్-నుహ్ జిల్లాల పరిధిలోని అటవీ ప్రాంతంలో జూ సఫారి ఏర్పాటుపై కోర్టుకు హర్యానా ప్రభుత్వం డీపీఆర్ సమర్పించింది. అంతేకాదు.. గతంలో అనుకున్నట్లుగా 10,000 ఎకరాల్లో కాకుండా 3,300 ఎకరాల్లోనే పార్క్ ఏర్పాటు చేస్తావని కోర్టుకు తెలిపింది. ఇందుకు అనుమతివ్వాలని కోరింది. అయినప్పటికీ, తాము ఇప్పటికి అనుమతులు మాత్రం ఇవ్వబోమని కోర్టు చెప్పింది. ఆరావళిని తాకనివ్వబోమని తేల్చింది. అంతేకాదు.. ఈ అంశంపై ఉన్నతస్థాయి నిపుణుల కమిటీ ఏర్పాటు చేసి, శాస్త్రీయ అంశాలతో పూర్తిస్థాయి నివేదిక అందిస్తే అప్పుడు పరిశీలిస్తామని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ విషయంలో తామేమీ నిపుణులం కాదని, అందుకే స్వతంత్ర సంస్థ అందించే సూచనల్ని పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొంది. ఆరావళి పర్వతాల్ని తాకేందుకు అనుమతివ్వబోమని చెప్పింది. మరోవైపు ఆరావళి పర్వతాల్ని రక్షించాలనే ఉద్యమం దేశవ్యాప్తంగా నడుస్తోంది.



## ఓటీటీల్లో అలరిస్తున్న సినిమాలివే..

**అమెజాన్ ప్రైమ్:**

1. బ్యాండ్ వాలే - వెబ్ సిరీస్.
2. క్రాస్ సీజన్ 2 - ఇంగ్లీష్ సిరీస్
3. ది స్ట్రేంజర్స్ చాప్టర్ 2 - ఇంగ్లీష్ మూవీ
4. మేటర్ ఆఫ్ ది టైం - ఇంగ్లీష్ మూవీ
5. మదానియన్ - పంజాబ్ మూవీ
6. ది థింగ్స్ యు కిల్ - టర్కిష్ మూవీ




**జియో హాట్ స్టార్:**

1. ది కంజ్యూరింగ్ లాస్ట్ రైట్స్ - ఇంగ్లీష్ సిరీస్
2. 3బీహెచ్‌కే - తమిళ్ ,తెలుగు మూవీ
3. ప్రిడేటర్: బ్యాడ్లాండ్స్ - ఇంగ్లీష్ మూవీ
4. ది బర్బ్స్ - ఇంగ్లీష్ సిరీస్
5. ది ఆర్ట్ ఫుల్ డాడ్జర్ ‌ూ 2




**నెట్ ఫ్లిక్:**

1. అనగనగా ఒక రాజు
2. తలైవార్ తంబి తలైమైయిల్
3. శుద్ధ్ దేశీ రొమాన్స్.. 4. యే డిల్లగి
5. కుక్కూ.. 6. లవ్ ఈజ్ బ్లైండ్: సీజన్ 10
7. బ్లూ మూన్.. 8. మోటర్ వ్యాలీ

**జీ 5:**

1. మన శంకర వరప్రసాద్ గారు
2. ఉత్తరర్.. 3. బేబీ గర్ల్: సోనీ లైవ్
4. ఎటర్నటీ- ఆపిల్ ప్లస్ టీవీ



## టాక్సిక్.. తప్పుగా అంచనా వేయొద్దు!

దాదాపు నాలుగేళ్ల విరామం తీసుకున్న యష్ ఇప్పుడు ‘టాక్సిక్’ మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. గీతూ మోహన్‌దాస్ ఈ మూవీకి డైరెక్టర్. లేడీ సూపర్ స్టార్ నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హ్యూమ ఖురేషీ హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. మలయాళ క్రేజీ హీరో టొవినోథామస్, బాలీవుడ్ యాక్టర్ వివేక్ ఓబెరాయ్ కజిన్, అక్షయ్ ఓబెరాయ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో ఏక కాలంలో రూపొందుతున్న ఈ మూవీ కన్నడ, తెలుగు, తమిళ. మలయాళ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో భారీ స్థాయిలో రిలీజ్ కాబోతోంది. 1940 టు 1970 మధ్య సాగే పీరియాడిక్ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ మూవీ టీజర్ అత్యంత వివాదాస్పదం కావడం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుక్‌ను దాని కవర్‌ను చూసి అంచనా వేయవద్దన్నట్టుగా టీజర్‌ని చూసి సినిమాపై ఓ నిర్ణయానికి రావద్దని డాక్టర్ జయమాల ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ‘టీజర్ అంటే ప్రేక్షకుల్ని థియేటర్లకు ఆకర్షించడానికి ఉద్దేశించిన చిన్న దృశ్యం. సెన్సార్ బోర్డ్ సమీక్షకు ముందే సినిమా గురించి ఒక నిర్ణయానికి రావడం అపరిపక్వ నిర్ణయమే అవుతుంది. మేకర్స్ ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి వందల కోట్లు ఖర్చు చేసి సినిమాలు నిర్మిస్తారు. అయితే దానిపై ప్రేక్షకుల ఒక అభిప్రాయాన్ని ఏర్పరచుకునే ముందు పూర్తి సినిమా చేస్తే మంచిది. సినిమాలో అశ్లీల సన్నివేశాలేవీ లేవని నిర్మాతలు చెప్పారని, అలాంటివి ఏవైనా ఉంటే వాటిని సెన్సార్ కమిటీ చూసుకుంటుంద’ని పేర్కొన్నారు.



## అల్లు వారింట.. హల్దీ వేడుక

టాలీవుడ్ ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ ఇంట పెళ్లి బాజాలు మోగనున్నాయి. ఆయన చిన్న కుమారుడు, యంగ్ హీరో అల్లు శిరీష్.. త్వరలో తన ప్రేయసి నయనిక రెడ్డితో వివాహ బంధంలో అడుగు పెట్టనున్నారు. మార్చి 6న హైదరాబాద్ లో వారి పెళ్లి వేడుకను గ్రాండ్ గా నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు సిద్ధమవుతున్నారు. అయితే మ్యారేజ్ డేట్ దగ్గరపడుతుండటంతో పెళ్లి పనులు మొదలయ్యాయి. వివాహానికి ముందుగా కుటుంబసభ్యులు సంప్రదాయ కార్యక్రమాలను స్టార్ట్ చేశారు. కొద్దిరోజుల క్రితం దుబాయ్ లో కుటుంబసభ్యులు, ఫ్రెండ్స్ మధ్యలో శిరీష్, నయనిక ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్ జరిగాయి. ఓ విలాసవంతమైన నౌకలో జరిగిన ఆ ఈవెంట్ లో అంతా ఫుల్ గా ఎంజాయ్ చేశారు. హీరో అల్లు అర్జున్, ఆయన సతీమణి స్నేహా రెడ్డి సహా పలువురు పాల్గొని స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచారు. తాజాగా హైదరాబాద్ లోని అల్లు అరవింద్ నివాసంలో పసుపు దంచుడు కార్యక్రమాన్ని నిర్వహించారు కుటుంబసభ్యులు. ఇంటి పెద్దల సమక్షంలో జరిగిన ఆ కార్యక్రమంలో పూజలు నిర్వహించి పెళ్లి పనులు మొదలుపెట్టారు. అందుకు సంబంధించిన విజువల్స్ తో కూడిన స్పెషల్ వీడియోను శిరీష్ సోషల్ మీడియాలో షేర్ చేయగా.. ఫుల్ వైరల్ అవుతోంది. అయితే పసుపు దంచుడు కార్యక్రమానికి అల్లు కుటుంబ సభ్యులు అంతా హాజరయ్యారు. మెగాస్టార్ చిరంజీవి ఫ్యామిలీ మెంబర్స్, ఆయన కుమార్తె సుస్మిత, హీరో రామ్ చరణ్ సతీమణి ఉపాసన, అలాగే పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా లెజినోవా హాజరై శిరీష్ ను ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి సింపుల్ గా అయినా ఆనందంగా వేడుక జరుపుకున్నారు.

## మెగా వారసుల పేర్లు వెల్లడించిన చిరు



మెగాస్టార్ చిరంజీవి ఇంట మరోసారి పండగ వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. ఇటీవల గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ -- ఉపాసన దంపతులు మరోసారి కవల పిల్లలకు జన్మనివ్వగా.. ఈ పిల్లలకు నేడు నామకరణ వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుక అనంతరం మెగాస్టార్ చిరంజీవి స్వయంగా తన మనవడు, మనవరాలి పేర్లను సోషల్ మీడియా వేదికగా ప్రకటిస్తూ ఆ పేర్ల వెనుక ఉన్న లోతైన అర్థాన్ని అభిమానులతో పంచుకున్నారు. మెగా కవలలకు శివ రామ్ కొణిదెల, అన్వీర దేవి కొణిదెల అనే పేర్లను ఖరారు చేసినట్లు ఆయన వెల్లడించారు. మనువడికి పెట్టిన ‘శివ రామ్’ అనే పేరు రెండు గొప్ప వ్యక్తిత్వాల కలయిక అని చిరంజీవి వివరించారు. తన అసలు పేరు శివ శంకర వరప్రసాద్‌లోని ‘శివ’ అనే పదం అంతర్గత శక్తికి, ఆధ్యాత్మికతకు ప్రతీక అయితే, రామ్ చరణ్‌లోని ‘రామ్’ అనే పదం ధర్మానికి, కరుణకు చిహ్నామని పేర్కొన్నారు. అలాగే మనవరాలికి పెట్టిన ‘అన్వీర దేవి’ అనే పేరు దైవిక శక్తికి రూపమని, కనకదుర్గమ్మ తల్లి దీవెనలతో పెట్టిన ఈ పేరు భయం లేని తనాన్ని, అచంచలమైన ధైర్యాన్ని సూచిస్తుందని ఆయన తెలిపారు.



## దెబ్బకు దిగొస్తున్న పూజాహెగ్డే

టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్ల లిస్ట్ లో టాప్‌లో నిలిచిన పూజా హెగ్డే ఇప్పుడు కొత్త ప్లాన్ తో తిరిగి రీఎంట్రీకి సిద్ధమవుతున్నారు. వరుస సక్సెస్‌లతో స్టార్ హీరోల సరసన మెరిసిన ఈ బ్యూటీ, ఆ తర్వాత ఎదురైన వరుస పరాజయాలతో కొంత వెనుకబడ్డారు. అయితే తన కెరీర్‌లో వచ్చిన ఈ మలుపును ఒక బ్రేక్ లాగా కాకుండా పూజా దాన్నొక రీసెట్ బటన్‌గా తీసుకున్నట్టుగా కనిపిస్తోంది. టాలీవుడ్‌లో ఒక దశలో అత్యంత బిజీ హీరోయిన్‌గా కొనసాగిన పూజా హెగ్డే, భారీ పారితోషికం కారణంగా కూడా కొన్ని ప్రాజెక్టులు చేజార్చుకుందనే టాక్ ఇండస్ట్రీలో వినిపించింది. నిర్మాతలు ఖర్చులను కట్టడి చేయాలనుకున్న సమయంలో ఆమె రెమ్యునరేషన్ అడ్డంకిగా మారిందని అప్పట్లో ప్రచారం జరిగింది. అదే సమయంలో పూజా హీరోయిన్ గా నటించిన కొన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచాయి. ఈ పరిణామాలతో పూజాకు టాలీవుడ్‌లో గ్యాప్ ఏర్పడింది. అయితే ప్రస్తుతం పరిస్థితులు మారుతున్నాయి. తమిళం, హిందీ భాషల్లో సినిమాలు చేస్తూనే మంచి బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌లతో బిజీగా ఉన్నప్పటికీ, పూజా హెగ్డే దృష్టి మళ్లీ తెలుగుపైనే ఉందని సమాచారం.

## నన్ను నమ్మినోళ్లకు థ్యాంక్స్: శ్రీలీల



టాలీవుడ్ సెన్సేషనల్ హీరోయిన్ శ్రీలీల తన జీవితంలో ఒక అపురూపమైన మైలురాయిని చేరుకుంది. వెండితెరపై నటిగా అలరిస్తూనే, మరోవైపు వైద్య విద్యను విజయవంతంగా పూర్తి చేసి, ఇప్పుడు అధికారికంగా డాక్టర్ శ్రీలీల’గా మారిపోయింది. షూటింగ్ సెట్స్‌లో ఖాళీ సమయం దొరికితే చాలు పుస్తకాలతో కుస్తీ పట్టిన ఆమె కష్టానికి ఫలితం దక్కింది. ఈ విషయాన్ని తెలుపుతూ శ్రీలీల తన ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఎమోషనల్ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. “ఇది కేవలం ఒక డిగ్రీ మాత్రమే కాదు.. నా ఎదుగుదలకు, నమ్మకానికి, కన్నీళ్లకు, పట్టుదలకు నిదర్శనం. రంగుల ప్రపంచం (సినిమాలు) నుంచి నేను ప్రశాంతంగా తలదాచుకునే నా పవిత్రమైన ప్రదేశమే ఈ వైద్య విద్య. అక్కడ నేను కేవలం ఒక విద్యార్థిగా, నేనేలా ఉండాలనుకున్నానో అలా ఉండగలిగాను” అని శ్రీలీల భావోద్వేగానికి లోనయ్యారు. ‘నేను నన్ను నమ్మడం నేర్చుకుంటున్న సమయంలో.. నాకంటే ఎక్కువగా నన్ను నమ్మిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటాను. ప్రతి చిరునవ్వు, ప్రతి ప్రోత్సాహం, మీరు నా కోసం చేసిన ప్రతి నిశ్శబ్ద ప్రార్థన నన్ను ఈ స్థాయికి చేర్చాయి. ఈ అధ్యాయం నన్ను ఎంతో వినయంగా, బలంగా మార్చింది. అందుకే, నన్ను నేను మీకు మళ్ళీ పరిచయం చేసుకుంటున్నాను.. ప్రేమతో మీ డాక్టర్ శ్రీలీల’ అని వెల్లడించింది.



## పలాశ్‌ను ఏమనొద్దు: బాంబే హైకోర్టు

ప్రముఖ బాలీవుడ్ సంగీత దర్శకుడు, గాయకుడు, సినిమా దర్శకుడు అయిన పలాష్ ముచ్చల్.. ప్రముఖ నటుడు, నిర్మాత అయిన విద్యాన్ మానేపై పరువు నష్టం కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే . ఈ విషయంలో ఇప్పుడు పలాష్ కి బాంబే హైకోర్టు నుండి మధ్యంతర ఉపశమనం లభించింది. ఈ మేరకు పలాష్ తరఫు న్యాయవాది శ్రేయాన్స్ ఆర్ మిథారే స్పందిస్తూ.. “విద్యాన్ మానేపై పరువు నష్టం కేసులో బాంబే హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. పలాష్ ప్రతిష్టకు హాని కలిగించే ప్రకటనలు ఇకపై విద్యాన్ మానే చేయకుండా నిరోధించింది. దీంతో బాంబే హైకోర్టు తీర్పు మేరకు పలాష్ కి భారీ ఊరట లభించిందని” శ్రేయాన్స్ ఆర్ మిథారే చెప్పుకొచ్చారు. ఇకపోతే తదుపరి విచారణను మార్చ్ 11 కు వాయిదా వేశారు.







# వరుణుడు షాకిస్తాడా?

## భారత్ – పాక్ మ్యాచ్‌కు వర్షం పడే చాన్స్.. మ్యాచ్ రద్దయితే చెరో పాయింట్

యావత్ క్రికెట్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న భారత్ – పాకిస్థాన్ హైఓల్టేజ్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. ఆదివారం కొలంబో వేదికగా దాయాదుల సమరానికి తెరలేవనుంది. పాకిస్థాన్ ప్రభుత్వం ఆడిన బాయ్ కాట్ డ్రామాతో ఈ హైఓల్టేజ్ మ్యాచ్‌పై నెలకొన్న అనిశ్చితికి ఐసీసీ తెరదించినా.. మరో భారీ అడ్డంకి ఏర్పడింది. ఈ మ్యాచ్ వర్షార్పణమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని శ్రీలంక వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ ప్రకటన ఇప్పుడు క్రికెట్ అభిమానుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. శ్రీలంక వాతావరణ శాఖ విడుదల చేసిన ప్రత్యేక వాతావరణ బులెటిన్ వివరాల ప్రకారం.. ఫిబ్రవరి 15 నాటికి ఆగ్నేయ బంగాళఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ బులెటిన్‌లో శ్రీలంక వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ అల్ప పీడనం ప్రభావంతో భారీ వర్షాలు, బలమైన ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది. ఈ అల్పపీడన ప్రభావం భారత్, పాకిస్థాన్ మ్యాచ్ జరిగే కొలంబోలోని ప్రేమదాస స్టేడియం సమీపంలో కూడా ఉండనుంది. మ్యాచ్ రోజు మైదానాన్ని మబ్బులు కమ్మేసే అవకాశం ఉందని, వర్షం కురిసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో స్పష్టమైంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ ముందు పాకిస్థాన్ ప్రాక్టీస్ మ్యాచ్ కూడా వర్షంతో తుడిచిపెట్టుకుపోయిన సంగతి తెలిసిందే. గూగుల్ వెదర్ ఫోర్‌కాస్ట్ కూడా వర్షం పడే అవకాశం ఉందని సూచిస్తోంది. వర్షంతో భారత్-పాక్ మ్యాచ్ రద్దయితే ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించనున్నారు. ఎందుకంటే ఇది లీగ్ మ్యాచ్ కావడంతో రిజర్వ్ డే లేదు. చెరో పాయింట్ లభిస్తే ఇరు జట్లు ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా సూపర్-8కు అర్హత సాధించనున్నాయి. అయితే బ్రాడ్‌కాస్టర్స్ తీవ్రంగా నష్టపోనుండగా.. అభిమానులు తీవ్ర నిరాశకు గురవ్వనున్నారు. ఈ మ్యాచ్ చుట్టూ రూ.4500 కోట్ల వ్యాపారం జరగనుంది. ఇప్పటికే కొలంబో ఫ్లైట్ టికెట్స్, హోటల్ రూమ్స్ ధరలు కొండెక్కాయి. ఈ మ్యాచ్ సజావుగా జరగాలని, పాకిస్థాన్‌ను చిత్తుగా ఓడించాలని భారత అభిమానులు కోరుకుంటున్నారు.

# యూఏఈ టైట్ విన్

### కెనడాకు రెండో ఓటమి



టీ20 ప్రపంచకప్‌లో యూఏఈ బోణీ కొట్టింది. ఢిల్లీలో నువ్వానేనా అన్నటు సాగిన ఉత్కంఠ పోరులో కెనడాపై 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. మొదట జునైద్ సిద్ధిఖీ(5-35) వికెట్ల వేటతో ప్రత్యర్థిని దెబ్బ తీయగా.. ఓపెనర్ ఆర్యన్ష్ శర్మ(74 నాటౌట్), సొహైబ్ ఖాన్(51)లు అర్ధ శతకంతో జట్టును గెలిపించారు. ఆఖరి ఓవర్లో సొహైబ్ ఔటైనా.. అర్ఫాన్ సింగిల్ తీయడంతో యూఏఈ డగౌట్‌లో సంబురాలు మొదలయ్యాయి. వరుసగా రెండో ఓటమితో కెనడా సూపర్-8 అవకాశాల్ని సంక్లిష్టం చేసుకుంది. గ్రూప్ డీలోని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కొద్దిలో ఓటమి తప్పించుకుంది. తొలి పోరులో న్యూజిలాండ్ చేతిలో చిత్తు చిత్తుగా ఓడిన అరబ్ జట్టు.. రెండో మ్యాచ్‌లోనూ అతికష్టమ్మీద గట్టెక్కింది. అరుణ్ జైట్లీ స్టేడియంలో జునైద్ సిద్ధిఖీ(5-35) పంజా విసరగా కెనడాను 150కే కట్టడి చేసిన యూఏఈ.. ఛేదనలో మాత్రం తడబడింది. ఒకదశలో నాలుగు ప్రధాన వికెట్లు కోల్పోయి ఓటమి దిశగా సాగింది. మరో వికెట్ పడి ఉంటే ఆ జట్టు ఓటమి ఖాయమయ్యేది. కానీ, ఓపెనర్ ఆర్యన్ష్ శర్మ(74 నాటౌట్), సొహైబ్ ఖాన్(51)లు పట్టుదలతో నిలబడి గెలుపునందించారు. కెనడా నిర్దేశించిన 151 పరుగుల ఛేదనలో సహచరులు వెనుదిరిగినా ఓపెనర్ ఆర్యన్ష్ శర్మ(74 నాటౌట్) క్రీజునంటుకుపోయాడు. కానీ, సాద్ బిన్ జఫర్(3-14) చెలరేగంతో 66కే నాలుగు వికెట్లు కోల్పోయింది యూఏఈ. ఆ దశలో మరో వికెట్ పడి ఉంటే మ్యాచ్ చేజారేది. అయితే.. సొహైబ్ ఖాన్(51)తో కలిసి ఆర్యన్ష్ ఇన్నింగ్స్ నిర్మించాడు. ప్రత్యర్థి బౌలర్లను విసిగిస్తూ.. బౌండరీలతో స్కోర్‌బోర్డును నడిపించారిద్దరూ. ఐదో వికెట్‌కు ఆఖరి ఓవర్లో సొహైబ్ ఔట్ కావడంతో ఉత్కంఠ నెలకొంది. మూడు బంతుల్లో ఒక పరుగు అవసరమవ్వగా.. అర్ఫాన్ సింగిల్ తీసి గెలిపించాడు. ఐదు వికెట్ల తేడాతో నెగ్గిన యూఏఈ పట్టికలో మూడో స్థానంలో నిలిచింది. కెరీర్ బెస్ట్ ప్రదర్శనతో జట్టు విజయంలో భాగమైన జునైద్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

## యూఏఈ చేతిలో భారత్-ఏ ఓటమి

### మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీ

మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2026 టోర్నీలో టీమిండియాకు బిగ్ షాక్ తగిలింది. పసికూన యూఏఈ చేతిలో రాధయాదవ్ సారథ్యంలోని భారత-ఏ జట్టు ఖంగుతిన్నది. దాంతో ఈ టోర్నీని ఘోర పరాజయంతో ప్రారంభించింది. గ్రూప్-ఏలో భాగంగా శుక్రవారం యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన భారత్-ఏ 7 వికెట్ల తేడాతో చిత్తయ్యింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఇషా ఒజా(72 నాటౌట్, 2/30) ఆల్‌రౌండ్ షోతో భారత్-ఏ పతనాన్ని శాసించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్- ఏ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 130 పరుగులు చేసింది. అనుష్క శర్మ(45 బంతుల్లో 7 ఫోర్లతో 47), తనూజ కన్వార్(25 బంతుల్లో 5 ఫోర్లతో 34) మినహా మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. కెప్టెన్ రాధాయాదవ్(7)తీవ్రంగా నిరాశపర్చింది. యూఏఈ బౌలర్లలో సమైరా ధరింధర్కా(3/40) మూడు వికెట్లు తీయగా.. వైష్ణవే మహేష్(2/13), ఇషా ఒజా(2/30) రెండేసి వికెట్లు పడగొట్టాడు. సురక్ష కొట్టే, అతిగే సిల్వా చెరో వికెట్ తీసారు.

## పాక్‌తో మ్యాచ్‌లో అభిషేక్

పాకిస్థాన్‌తో ఆదివారం జరిగే మ్యాచ్‌లో అభిషేక్ శర్మ ఆడే అవకాశాలు ఉన్నట్లు భారత స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తెలిపాడు. కడుపు ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న అభిషేక్.. గురువారం నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో ఆడని విషయం తెలిసిందే. అయితే అభిషేక్ శర్మ ఆరోగ్యం ప్రస్తుతం బాగానే ఉన్నట్లు వరుణ్ చెప్పాడు. ఆరోగ్యం క్షీణించడం వల్ల రెండు రోజుల పాటు అభిషేక్ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నాడు. అభిషేక్‌తో మాట్లాడానని, అతను బాగానే ఉన్నాడని, ఇవాళ కొంత ప్రాక్టీస్ చేశాడని, సిద్ధం అవుతున్నట్లు అతను చెప్పాడని వరుణ్ చక్రవర్తి పేర్కొన్నాడు. నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో వరుణ్ చక్రవర్తి రెండు ఓవర్లు వేసి 7 పరుగులిచ్చి మూడు వికెట్లు తీసుకున్నాడు. ఆ మ్యాచ్ టాస్ వేసిన సమయంలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ఒకటి లేదా రెండు మ్యాచ్‌లు అభిషేక్ శర్మ మిస్సయ్యే అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్న విషయం తెలిసిందే. అభిషేక్ శర్మ గైర్హాజరీలో నమీబియాతో మ్యాచ్‌లో సంజూ శాంసన్ ఓపెనింగ్ బాధ్యతలు చేపట్టాడు. వరల్డ్‌కప్‌లో ఇండియా వరుసగా తన రెండో మ్యాచ్ నెగ్గింది. నమీబియాపై 93 రన్స్ తేడాతో నెగ్గింది. ఒకవేళ కొలంబోలో జరిగే ప్రాక్టీస్ సెషన్‌లో అభిషేక్ పాల్గొంటే అతను పాక్‌తో మ్యాచ్‌కు ఆడేది లేనిది తేలే అవకాశం ఉంటుంది. నెట్స్‌లో చాలా సమయం అతను బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయాల్సి ఉంటుంది. దాని ఆధారంగా ఇండోపాక్ మ్యాచ్‌పై క్లారిటీ వస్తుంది.




# 2007 సీన్ రిపీట్?

### ఆస్ట్రేలియాను ఓడించిన జింబాబ్వే

### కప్పు టీమిండియాదే?

### నెట్టింట్లో జోరుగా లెక్కలు




ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో సంచలన ఫలితం నమోదైంది. పసికూన జింబాబ్వే మాజీ ఛాంపియన్ ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. గ్రూప్-బీలో భాగంగా కొలంబో వేదికగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో జింబాబ్వే 23 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాపై ఘన విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బ్లెస్సింగ్ ముజర్బాని(4/17) ఆస్ట్రేలియా పతనాన్ని శాసించాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ చరిత్రలో జింబాబ్వే చేతిలో ఆస్ట్రేలియాకు ఇది రెండో పరాజయం. అరంగేట్ర టీ20 ప్రపంచకప్ 2007లోనూ జింబాబ్వే చేతిలోనే ఆస్ట్రేలియా ఓటమిపాలైంది. అప్పుడు మహేంద్ర సింగ్ ధోనీ సారథ్యంలోని భారత్ జట్టు విజేతగా నిలిచింది. తాజా టోర్నీలోనూ ఆస్ట్రేలియాకు జింబాబ్వే షాకివ్వడంతో సెంటిమెంట్ రిపీట్ అవుతుందా? భారత్ విజేతగా నిలుస్తుందా? అని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్లకు 169 పరుగులు చేసింది. బ్రియాన్ బెన్నెట్(56 బంతుల్లో 7 ఫోర్లతో 64 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో చెలరేగగా.. తడివాన్ష మరుమణి(35), ర్యాన్ బర్ల్(35) పర్వాలేదనిపించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో మార్కస్ స్టోయినీస్, కామెరూన్ గ్రీన్ తలో వికెట్ తీసారు. అనంతరం ఆస్ట్రేలియా 19.3 ఓవర్లలో 146 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. మ్యాట్ రేన్‌షా(44 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 65) పోరాడినా ఫలితం లేకపోయింది. ఇతర బ్యాటర్ల నుంచి అతనికి సహకారం లభించలేదు. జింబాబ్వే బౌలర్లలో బ్లెస్సింగ్ ముజర్బాని(4/17) నాలుగు వికెట్లు తీయగా.. బ్రాడ్ ఇవాన్స్(3/23) మూడు వికెట్లు పడగొట్టగా.. వెల్లింగ్టన్, ర్యాన్ బర్ల్ తలో వికెట్ తీసారు. 170 పరుగుల సాధారణ లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా బ్యాటర్లు తీవ్రంగా తడబడ్డారు.



## రాజస్థాన్ కెప్టెన్‌గా పరాగ్

### జడేజాకు మొండి చేయి

రాజస్థాన్ రాయల్స్ కొత్త కెప్టెన్‌గా రియాన్ పరాగ్‌కే పగ్గాలు అప్పగించింది యాజమాన్యం. దాంతో, పంతొమ్మిదో సీజన్ వేలానికి ముందు ట్రేడ్ పద్ధతిలో సొంత గూటికి చేరిన రవీంద్ర జడేజా ఐపీఎల్ కెప్టెన్సీ కల చెదిరింది. నిరుడు సంజూ శాంసన్ గైర్హాజరీలో గులాబీ టీమ్‌ను నడిపించిన అతడికే యాజమాన్యం జై కొట్టిందని సమాచారం. ఈ విషయాన్ని శుక్రవారం ఎక్స్ వేదికగా వెల్లడించింది రాజస్థాన్ ఫ్రాంచైజీ. పద్దెనిమిదో సీజన్ అనంతరం రాజస్థాన్ జట్టుకు సంజూ శాంసన్ గుడ్ బై చెప్పడంతో తదుపరి సారథి? అనే చర్చ మొదలైంది. ట్రేడ్ పద్ధతిలో జట్టులోకి వచ్చిన రవీంద్ర జడేజాకు కెప్టెన్సీ ఇస్తారని.. రియాన్ పరాగ్, యశస్వీ జైస్వాల్, ధ్రువ్ జురెల్ కూడా రేసులో ఉన్నారని కథనాలు వచ్చాయి. కానీ, చివరకు జడ్డూను కూడా కాదని పరాగ్ నయా సారథిగా ఎంపికయ్యాడు. పంతొమ్మిదో సీజన్‌లో అతడి నాయకత్వంలోనే రాజస్థాన్ ఆడనుంది. ఇప్పటివరకూ రాజస్థాన్‌కు ఐదుగురు కెప్టెన్‌గా వ్యవహరించారు. ఆరంభ సీజన్‌లో దివంగత షేన్ వార్న్ కెప్టెన్సీలో ఆడిన రాజస్థాన్ ట్రోఫీని కొల్లగొట్టింది. 2012, 13వ సీజన్‌లో రాహుల్ ద్రవిడ్. 2014-15లో స్టీవ్ స్మిత్ సారథిగా సేవలందించారు. 2018-19లో అజింక్య రహానే.. అనంతరం మళ్లీ 2019-20 సీజన్లలో స్మిత్ పగ్గాలు స్వీకరించారు. 2021లో రాజస్థాన్ సారథిగా సంజూ శాంసన్ ఎంపికయ్యాడు. శాంసన్ నాయకత్వంలో దుమ్మురేపిన రాజస్థాన్ ఫైనల్ ఆడింది. అయితే.. గత రెండు సీజన్లలో ఆ జట్టు ప్లే ఆఫ్స్ చేరలేకపోయింది. పద్దెనిమిదో సీజన్‌లో సంజూ గాయంతో కొన్ని మ్యాచ్‌లకు దూరమవ్వగా.. రియాన్ పరాగ్ జట్టును అద్భుతంగా నడిపించాడు. పద్నాలుగేళ్ల వైభవ్ సూర్యవంశీ ఓపెనర్‌గా రికార్డు సెంచరీతో మెరవడం.. కెప్టెన్‌గా పరాగ్ రాణించడం శాంసన్కు ప్రతిబంధకంగా మారాయి. కొత్త జట్టుకు ఆడడమే మంచిదని భావించిన అతడు.. పంతొమ్మిదో సీజన్ వేలానికి ముందే ట్రేడ్ పద్ధతిన చెన్నైకి వెళ్లాడు. బదులుగా రవీంద్ర జడేజా, సామ్ కరన్‌లను తీసుకుంది రాజస్థాన్.



## అభిషేక్ గుడ్డిగా బ్యాట్ ఊపుతాడు: అమీర్

టీమిండియా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మపై పాకిస్థాన్ మాజీ క్రికెటర్ మొహమ్మద్ అమీర్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. అభిషేక్ శర్మ గాలిగాడని, గుడ్డిగా బ్యాట్ ఊపుతాడని తెలిపాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ఆదివారం కొలంబో వేదికగా భారత్, పాకిస్థాన్ మధ్య హైఓల్టేజ్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో ఓ టీవీ చర్చా కార్యక్రమంలో పాల్గొన్న అమీర్.. అభిషేక్ శర్మను తక్కువ చేసి మాట్లాడాడు. అభిషేక్ శర్మ హిట్టింగ్‌లో ఎలాంటి నైపుణ్యం లేదని, అదృష్టం కొద్దీ అప్పుడప్పుడు పరుగులు వస్తుంటాయని తెలిపాడు. అతను ఆడేది చాలా ప్రమాదకరమైన ఆట అని అభిప్రాయపడ్డాడు. 'అభిషేక్ శర్మ ఆటను నేను ఎక్కువగా చూడలేదు. కానీ నేను చూసిన కొద్దిపాటి ఆటను బట్టి నిజాయితీగా చెప్పాలంటే.. అతను కేవలం ఒక స్లాగర్(బాదుడుగాడు). అతను ప్రతీ బంతిని బలంగా బాదడానికే ప్రయత్నిస్తాడు. అతని రోజు బాగుండి ఆ ఆట క్లిక్ అయితే పర్వాలేదు. లేదంటే అతను విఫలమయ్యే అవకాశాలే చాలా ఎక్కువగా ఉన్నాయి. అతను 8 ఇన్నింగ్స్‌ల్లో ఒకసారి మాత్రమే స్కోరు చేస్తాడు. మిగిలిన సమయాల్లో అతని స్కోర్లు 10, 15, 0, 20 గానే ఉంటున్నాయి. టెక్నికల్‌గా అతను పటిష్టమైన బ్యాటర్ అని నేను అనుకోవడం లేదు. అతను ఒకే చోటు నిలబడి, అన్ని బంతులు తను కోరుకున్న ప్రదేశాల్లోనే పడాలని ఆశిస్తాడు. ఇది నా వ్యక్తిగత అభిప్రాయం. అయితే, అతను ఫామ్‌లో ఉన్న రోజున భారీ స్కోరు చేస్తాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం www.evarthalu.com
నేటి ఈవార్తలు
శనివారం 14-2-2026



# భరతమాత రక్తపు కన్నీరు

**2019** ఫిబ్రవరి 14.. జమ్మూ-కశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ కాన్వాయ్‌పై జరిగిన ఆత్మాహుతి దాడి భారత చరిత్రలో ఒక అత్యంత విషాదకరమైన, చీకటి రోజు. అవంతిపుర సమీపంలోని లేథిపురా వద్ద జైషే మహమ్మద్ ఉగ్రవాది ఆదిల్ అహ్మద్ దార్, పేలుడు పదార్థాలతో నిండిన వాహనంతో సీఆర్పీఎఫ్ బస్సును ఢీకొట్టడం వల్ల 40 మంది వీర జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘాతుకం కేవలం సైనికులపై జరిగిన దాడి మాత్రమే కాదు, యావత్ భారతావని ఆత్మగౌరవంపై జరిగిన దాడి. దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో కాపలా కాస్తున్న జవాన్లను పిరికిపందల్లా వెనుక నుంచి దెబ్బతీయడం ఉగ్రవాద మూకల అసహాయతను, క్రూరత్వాన్ని చాటి చెబుతోంది. పుల్వామా దాడిని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి, అమెరికా, రష్యా, ఫ్రాన్స్ వంటి అనేక దేశాలు ముక్తకంఠంతో ఖండించాయి. ఖండనతో సరిపోదు.. ఉగ్రవాద సంస్థలకు ఆశ్రయం కల్పిస్తున్న దేశాలను అంతర్జాతీయ స్థాయిలో ఏకాకిని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఐక్యరాజ్యసమితిలో జైషే మహమ్మద్ చీఫ్ మసూద్ అజార్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించడంలో జరిగిన జాప్యంపై భారత్ గట్టిగా పోరాడింది, ఇది దౌత్యపరమైన విజయమే. ఈ దాడికి ప్రతీకారంగా భారత వైమానిక దళం ఫిబ్రవరి 26న పాకిస్థాన్‌లోని బాలాకోట్‌లోని ఉగ్రవాద శిక్షణ శిబిరాలపై మెరుపు దాడులు నిర్వహించింది. భారత్ తనపై జరిగే ఏ దాడినైనా సహించబోదని, తగిన రీతిలో జవాబిస్తుందని ఈ చర్య ద్వారా స్పష్టమైన హెచ్చరిక పంపింది. నేటి ఉగ్రవాదం తుపాకులు, బాంబుల నుంచి బయో వార్ వైపు వెళ్తోంది. ఇలాంటి ప్రమాదాలను ఇప్పటికిప్పుడు పసిగట్టలేం. కాబట్టి అలాంటి ప్రమాదాలు ఎప్పుడు వస్తాయా? అని అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. మన పక్కన ఏం జరుగుతోంది? అని ఓ కన్నేసి ఉంచాలి. మన పని మనం చేసుకుంటూనే ఎవరు ఏం చేస్తున్నారు? జాతి వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారా? అన్నదీ ఓ కంట కనిపెడుతూ ఉండాలి. వాస్తవానికి ప్రస్తుత ఉగ్రవాదం దేశ సరిహద్దులను దాటి, దేశంలోకి చొరబడింది. మన మధ్యే తిరుగుతోంది. ఏ క్షణాన అది దాడి చేస్తుందో తెలియదు. ఏ దుశ్చర్యకు పాల్పడి ప్రాణాలను హరించి వేస్తుందో తెలియదు. కాబట్టి భారతీయుడా.. పారాహుషార్!

– ఈవార్తలు సంపాదకీయ విభాగం

# ప్రేమ

## ...నేడు వాలెంటైన్స్ డే

Love

ఏటా ఫిబ్రవరి 14వ తేదీ రాగానే ప్రపంచమంతా ఒక రకమైన భావోద్వేగ పండగ వాతావరణం నెలకొంటుంది. రంగురంగుల కానుకలు, ఎర్ర గులాబీలు, ఆకర్షణీయమైన ప్రకటనలు యువతను కట్టిపడేస్తాయి. సెయింట్ వాలెంటైన్ త్యాగానికి గుర్తుగా ప్రారంభమైన ఈ దినోత్సవం, నేడు కేవలం ఒక వ్యాపార వేడుకగానో లేదా ఆకర్షణల ప్రదర్శనగానో మారిపోవడం ఆందోళనకరం. నిజానికి, ప్రేమ అనేది ఒక లోతైన భావోద్వేగం. అది కేవలం ఒక రోజు సంబరంతో ముగిసిపోయేది కాదు. నేటి యువత ఈ వాలెంటైన్స్ డే సందర్భంగా ప్రేమలోని బాధ్యతను, పరిణతిని గుర్తించాల్సిన అవసరం ఎంతో ఉంది.



నేటి వేగవంతమైన ప్రపంచంలో యువత తరచుగా ఇన్స్టంట్ ఫలితాలను కోరుకుంటున్నారు. ఇది ప్రేమ విషయంలోనూ కనిపిస్తోంది. మొదటి చూపులో కలిగే ఆకర్షణను ప్రేమగా భ్రమపడటం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. ఒకరి రూపం లేదా హోదాను చూసి ఇష్టపడటం కంటే, వారి వ్యక్తిత్వాన్ని, సంస్కారాన్ని అర్థం చేసుకోవడం యువత బాధ్యత. ఆకర్షణ తాత్కాలికం, కానీ అనురాగం శాశ్వతం. బంధంలోకి అడుగుపెట్టే ముందు అది క్షణికావేశమా లేక జీవితకాలపు తోడా అని ఆలోచించాలి. నేటి యువత జీవితం స్మార్ట్‌ఫోన్‌లలోనే సాగుతోంది. ప్రేమను కూడా సోషల్ మీడియా వేదికగానే కొలుస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ కోసం లేదా ఫేస్‌బుక్ స్టేటస్ కోసం ఫోటోలు దిగడం, లైక్‌ల కోసం జంటగా నటించడం వంటివి పెరిగుతున్నాయి. ఆన్‌లైన్ ప్రపంచంలో కనిపించేవన్నీ నిజం కావు. వేరొకరి కృత్రిమ సంతోషాన్ని చూసి, తమ బంధం తక్కువని భావించడం ప్రమాదకరం. మీ బంధాన్ని ప్రదర్శన వస్తువుగా మార్చకండి. స్క్రీన్ వెనుక ఉండే లైక్‌ల కంటే, కష్టకాలంలో పక్కన నిలబడే ఒక చేయి విలువైనదని గుర్తించండి. ప్రేమలో ఉన్నామన్న నెపంతో భాగస్వామి ఫోన్ చెక్ చేయడం, వారి స్నేహితులతో మాట్లాడకుండా నియంత్రించడం లేదా వారి అభిరుచులను అణచివేయడం నేటికీ చాలా మంది చేసే తప్పు. నిజమైన ప్రేమ లక్షణం.. ఎదుటివారి వ్యక్తిత్వాన్ని గౌరవించడం. వారు మీ ఆస్తి కాదు, వారు ఒక స్వతంత్ర వ్యక్తి. బంధంలో 'మనం' ఎంత ముఖ్యమో, 'నేను' అన్న వ్యక్తిగత స్పేస్ కూడా అంతే ముఖ్యం. భాగస్వామి లక్ష్యాలను గౌరవించి, వారి ఎదుగుదలకు తోడ్పడటమే నిజమైన వాలెంటైన్ బాధ్యత. ప్రేమలో వైఫల్యం ఎదురైనప్పుడు ఆవేశానికి లోనై ప్రాణాలు తీసుకోవడం లేదా ఎదుటివారిపై దాడులు చేయడం (యాసిడ్ దాడులు, హత్యలు వంటివి) నాగరిక సమాజానికి గొడ్డలి పెట్టు. 'నో' అన్న పదాన్ని గౌరవంగా స్వీకరించడం నేర్చుకోవాలి. ప్రేమ అనేది బలవంతం కాదు, అది ఇష్టపూర్వకం. ఒక వ్యక్తి మన జీవితంలో లేకపోయినా, జీవితం ఆగిపోదని యువత గుర్తించాలి. వైఫల్యాన్ని ఒక పాఠంగా మలచుకుని, కెరీర్ వైపు దృష్టి సారించే మనోధైర్యాన్ని అలవర్చుకోవాలి. కార్పొరేట్ సంస్థలు వాలెంటైన్స్ డేను ఒక మార్కెట్ మాయాజాలంగా మార్చేశాయి. ఖరీదైన బహుమతులు ఇస్తేనే ప్రేమ ఉన్నట్లు ప్రచారం చేస్తున్నాయి. ఇది పేద, మధ్యతరగతి యువతలో అభద్రతా భావాన్ని కలిగిస్తోంది. ప్రేమ అంటే ఖర్చు కాదు, అది ఒక స్పర్శ. అది ఒక భరోసా. డబ్బుతో కొనలేని అనురాగాన్ని పంచుకోండి. తల్లిదండ్రుల కష్టార్జితాన్ని కేవలం ఆడంబరాల కోసం ఖర్చు చేయకుండా, భవిష్యత్తుకు పునాదులు వేసుకోండి. ప్రేమలో ఉన్నప్పుడు లోకమంతా మరచిపోవడం సినిమాటిక్ గా బాగుంటుందేమో కానీ, వాస్తవంలో అది సాధ్యం కాదు. ప్రేమను, బాధ్యతలను సమతుల్యం చేసుకోవాలి. చదువును, కెరీర్‌ను నిర్లక్ష్యం చేస్తూ చేసే ప్రేమ ఎప్పటికీ సుఖాన్ని ఇవ్వదు. మీ భాగస్వామితో కలిసి ఉన్నత శిఖరాలను అధిరోహించే లక్ష్యాన్ని పెట్టుకోండి. వాలెంటైన్స్ డే అనేది కేవలం ప్రేమికుల కోసమే కాదు, మానవత్వం పట్ల, తోటి మనుషుల పట్ల ప్రేమను చాటడానికి ఒక అవకాశం. నేటి యువత కేవలం ఒక రోజు రోజా పువ్వును ఇచ్చి చేతులు దులుపుకోకుండా మహిళల పట్ల గౌరవాన్ని పెంపొందించుకోవాలి. బంధాల్లో పారదర్శకత పాటించాలి. హుందాతనాన్ని కాపాడుకోవాలి. ప్రేమ అనేది ఒక శక్తి కావాలి కానీ, అది బలహీనత కాకూడదు. బాధ్యతాయుతమైన యువతే దేశానికి ఆస్తి. ప్రేమను పరిణతితో, గౌరవంతో సెలబ్రేట్ చేసుకుందాం.

నేటి వేగవంతమైన ప్రపంచంలో కుటుంబం అనేది రక్తసంబంధీకుల సమూహం మాత్రమే కాదు, అది ఒక వ్యక్తి నైతిక, మానసిక, సామాజిక ఎదుగుదలకు బలమైన పునాది. మారుతున్న కాలంతో పాటు కుటుంబ నిర్మాణాలు మారుతున్నప్పటికీ, అందులోని విలువల ప్రాముఖ్యత మాత్రం అలాగే ఉంది. కుటుంబం వ్యక్తికి ప్రేమ, నమ్మకం మరియు గౌరవం వంటి ప్రాథమిక సూత్రాలను నేర్పుతుంది. చిన్నప్పటి నుండే ఏది మంచి, ఏది చెడు అనే విచక్షణను కుటుంబం కల్పిస్తుంది.

# ..బాధ్యత



ఇది యువతను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దుతుంది. ఒత్తిడి, వైఫల్యాలు ఎదురైనప్పుడు కుటుంబం ఇచ్చే మద్దతు మరే ఇతర సామాజిక బృందం ఇవ్వలేదు. ముఖ్యంగా డిప్రెషన్, ఆత్మహత్య ఆలోచనల నుంచి యువతను రక్షించడంలో కుటుంబ సంబంధాలు కీలక పాత్ర పోషిస్తాయి. నిజాయితీ, ఓర్పు, సహకారం వంటి జీవిత నైపుణ్యాలను యువత తమ తల్లిదండ్రుల నుంచి, తోబుట్టువుల నుండి నేర్చుకుంటారు. ప్రస్తుత యువత పాత తరానికి భిన్నమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. పట్టణీకరణ, ప్రపంచీకరణ, సాంకేతిక విప్లవం వల్ల వారి ఆలోచనా దృక్పథంలో మార్పులు వచ్చాయి. ఇక్కడ తెలుసుకోవాల్సింది వ్యక్తిగత స్వేచ్ఛ, బాధ్యతకు తేడాలు. నేటి యువత స్వయంప్రతిపత్తిని కోరుకుంటోంది. ఉమ్మడి కుటుంబాల కంటే చిన్న కుటుంబాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉద్యోగ వేటలో భాగంగా దూర ప్రాంతాలకు వెళ్లడం వల్ల భౌతికంగా కుటుంబానికి దూరమవుతున్నారు. ఇది ఒకవైపు స్వేచ్ఛను ఇస్తున్నా, మరోవైపు ఒంటరితనాన్ని పెంచుతోంది. సోషల్ మీడియా, డిజిటల్ వ్యసనాలు కుటుంబ సభ్యుల మధ్య ముఖాముఖి సంభాషణలను తగ్గిస్తున్నాయి. ఫోన్లలో గడిపే సమయం పెరిగి, ఆత్మీయ పలకరింపులు తగ్గుతున్నాయి. యువత బాధ్యతల పట్ల విముఖంగా లేరు, కానీ వారు బాధ్యతను చూసే కోణం మారింది. స్త్రీ, పురుష సమానత్వాన్ని యువత ఎక్కువగా గౌరవిస్తున్నారు. గృహ బాధ్యతలలో పురుషుల భాగస్వామ్యం పెరుగుతోంది. దూరంగా ఉన్నప్పటికీ వీడియో కాల్స్, వాట్సాప్ గ్రూపుల ద్వారా కుటుంబంతో మానసిక బంధాన్ని కొనసాగిస్తున్నారు. జీవన ప్రమాణాలు పెరిగి వృద్ధుల సంఖ్య పెరుగుతుండటంతో, వారిని ఆత్మీయంగా చూసుకోవడం నేటి యువత ముందున్న పెద్ద సవాలుగా మారింది. సమాజం ఎంత ఆధునీకరణ వైపు వెళ్లినా, కుటుంబం అందించే భద్రతా వలయం అనివార్యం. యువత తమ కెరీర్ లక్ష్యాలను సాధిస్తూనే, కుటుంబ విలువల పట్ల గౌరవం పెంచుకోవాలి. పెద్దలు కూడా యువత కోరుకునే స్వేచ్ఛను అర్థం చేసుకుంటూ వారికి మార్గదర్శకత్వం చేయాలి. ఒకరినొకరు గౌరవించుకుంటూ, ప్రేమను పంచుకుంటేనే బలమైన సమాజం నిర్మాణమవుతుంది.

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.